RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 3 సంచిక : 3 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 జనవరి 2025 మంగళవారం పేజీలు : 4

## సనాతన వైదిక దేశమే లక్ష్యం

మహాకుంభ్‌నగర్ : భారత్‌ను సనాతన వైదిక దేశంగా మార్చడమే లక్ష్యమని పేర్కొంటూ ఇక్కడ ముగిసిన ధర్మ్ సంవాద్ సమావేశంలో తీర్మానించారు. కుంభమేళా సందర్భంగా ఇక్కడ శ్రీపంచ దశాహ్నం జున అఖాడా ఆధ్వర్యంలో స్వామి నరేంద్ర నాథ్ సరస్వతి అధ్యక్షతన రెండు రోజుల పాటు ఈ సమావేశం జరిగింది. ఇస్లామిక్ జిహాద్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా హిందువులపై దాడులు జరుగుతుండడాన్ని ఈ సమావేశం ఖండించింది. వక్ఫ్ బోర్డును తక్షణమే రద్దు చేయాలని డిమాండు చేసింది. సనాతన ధర్మ పరిరక్షణకు పోరాటం చేస్తున్న ఘాజియాబాద్‌లోని దస్నాదేవి మందిర ప్రధాన అర్చకుడు, మహామండలేశ్వర్ యతి నరసింగానంద్ గిరికి మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించింది.



# బైపోల్ వస్తే...

## పదింటిలో బీఆర్ఎస్‌కు నాలుగే!

## తాజా సర్వేలో షాకింగ్ అంశాలు!!

హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయం రోజురోజుకు ముదురుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలను తమ వైపునకు లాక్కుని గట్టి దెబ్బకొట్టిన కాంగ్రెస్‌కు ఉప ఎన్నికల ద్వారా చెక్ పెట్టేందుకు బీఆర్ఎస్ పావులు కదుపుతున్నది. ఇందు కోసం ఆ పార్టీ సుప్రీంకోర్టు తలుపులు తట్టడంతో ఇప్పుడు రాష్ట్ర రాజకీయం అంతా ఉప ఎన్నికల చుట్టే తిరుగుతోంది.

మరోవైపు బీఆర్ఎస్ నేతలు ఆ పది సెగ్మెంట్లలో ఉప ఎన్నికలు ఖాయమని చెబుతూ వస్తున్నారు.

ఈ క్రమంలో ఆ సెగ్మెంట్లలో మళ్లీ ఎన్నికల నగరా మోగితే నెగ్గేదెవరు? ఓడేదెవరంటూ సర్వే సంస్థలు ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నాయి. ఇందులో ఆసక్తిర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**కారు, హస్తం 50:50...** సీ-ప్యాక్ సంస్థ చేసిన సర్వే ప్రకారం ఉప ఎన్నికలు వస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెరో నాలుగు స్థానాలు దక్కనున్నయని వెల్లడైంది. మరో రెండు స్థానాల్లో ఇరు టఫ్ ఫైట్ ఉండే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసింది.

ఈ సర్వే ప్రకారం భద్రాచలం, గద్వాల్, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ, చేవెళ్ల, స్టేషన్ ఘన్‌పూర్, బాన్సువాడ, జగిత్యాలలో బీఆర్ఎస్ గెలిచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక ఖైరతాబాద్‌లో ట్రయాంగిల్ ఫైట్, రాజేంద్రనగర్‌లో టఫ్ ఫైట్ ఉండబోతున్నదని తేల్చింది.

ఈ సర్వే అంచనాలను ట్విట్టర్ హ్యాంటిల్‌లో ఆ సంస్థ పోస్టు షేర్ చేసింది. అయితే ఈ సర్వేలో బీజేపీ ప్రస్తావన తీసుకురాకపోవడం గమనార్హం. ఈ ట్విట్టర్ హ్యాండిల్ బీఆర్ఎస్ అనుకూలమైనదనే ప్రచారం సోషల్ మీడియాలో జరుగుతోంది.

**పథకాలతో ప్రజల్లోకి అధికార పార్టీ :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తూ నిర్ణయాలను వెల్లడిస్తున్నది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు, ఇందిరమ్మ అభయహస్తం వంటి పథకాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకువెళ్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు ఉద్యమ కాలంలో తమ ఆయువు పట్టుయిన బై ఎలక్షన్ స్ట్రాటజీని బీఆర్ఎస్ వెలికితీస్తోంది. తాజాగా కేటీఆర్ బై ఎలక్షన్ వ్యూహాన్ని తెరపైకి తీసుకురావడం వెనుక ఇదే వ్యూహం అనే టాక్ వినిపిస్తోంది. అయితే ముల్లును ముల్లుతోనే తీయాలనే చందంగా బై పోల్ కోసం తహతహలాడుతున్న బీఆర్ఎస్‌కు అదే ఉప ఎన్నికల ద్వారా చెక్ పెట్టాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ మారిన పది చోట్ల ఉప ఎన్నికలు వస్తే అన్ని స్థానాలు తమ ఖాతాలోనే వేసుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి పక్కాగా స్కెచ్ వేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయంలో రూట్ మ్యాప్ అంతా సిద్ధం చేసుకున్న ముఖ్యమంత్రి.. బై పోల్ వస్తే తమ అభ్యర్థులను పక్కాగా నెగ్గించుకునేలా వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతున్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్ : హైదరాబాద్లో భారీ పెట్టుబడి పెట్టేందుకు సింగపూర్కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ ముందుకొచ్చింది. రాష్ట్రంలో రూ.450 కోట్లతో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ప్రకటించింది. ఆ దేశంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందంతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో కంపెనీ నిర్ణయం తీసుకుంది. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్కును అభివృద్ధి చేయనుంది. క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయ పడ్డారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్ను అందుకునేలా అన్ని సౌకర్యాలు ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయి. కంపెనీ ఇండియా ట్రస్ట్ మేనేజ్మెంట్ సీఈవో గౌరీశంకర్ నాగభూషణం మాట్లాడుతూ రేవంత్ సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిర వృద్ధి చెందుతోందనీ, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్లో అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటీపీహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలో అందుబాటులోకి రానుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్రెడ్డి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి అజిత్రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు.




### డిమాండ్ల సాధనకు తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె నోటీసులు

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నేతలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, 2 పీఆర్సీల అమలు, సీసీఎస్, పీఎఫ్ డబ్బులు రూ.2,700 కోట్లు చెల్లింపు తదితర డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు దిగుతామని నోటీసుల్లో పేర్కొన్నారు. “ మేనిఫెస్టోలోని అంశాలను ప్రభుత్వం అమలు చేయాలి. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణను ప్రైవేటు కంపెనీలు చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ట్రేడ్ యూనియన్లకు ఎన్నికలు నిర్వహించడం లేదు. యూనియన్లు రద్దు చేసి, కార్మికులకు పనిగంటలు పెంచారు.” అని జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున కార్మిక సంఘాల నేతలు బస్ భవన్ వద్దకు చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు.

# పల్లెపోరుకు రంగం సిద్ధం!




## ప్రక్రియ మొత్తం పూర్తి చేసిన అధికార యంత్రాంగం!!

## ముందు గ్రామం - తర్వాత పట్టణం

హైదరాబాద్ : వచ్చే ఏడాది జనవరి రెండో వారం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఎలక్షన్స్‌కు ముందు జరగాల్సిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలకు సవరణలను పూర్తి చేసింది. ప్రధానంగా రిజర్వేషన్లను ఐదేండ్లకోసారి మార్చే సవరణకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. వీటితోపాటు పంచాయతీరాజ్ చట్ట సవరణలో అనేక మార్పులు చేశారు. ఒక మండలంలో కనీసం ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండే విధంగా మార్పు చేశారు. 80 గ్రామాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేశారు. కొత్తగా 12 మున్సిపాలిటీలను ఏర్పాటు చేయగా, రెండింటిని కార్పొరేషన్లుగా అప్ గ్రేడ్ చేశారు. ఇలా ఎన్నికలకు చట్ట పరంగా చేయవలసిన ఏర్పాట్లన్నింటినీ ప్రభుత్వం పూర్తి చేసింది. మరోవైపు ఎన్నికల కమిషన్ సైతం ఓటరు జాబితాను, పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేసింది.

**డెడికేటెడ్ కమిషన్ నివేదిక తరువాయి..** స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ ను సుప్రీంకోర్టు సూచించిన విధంగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా ఖరారు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పటికే జిల్లా పర్యటనలు, బహిరంగ వినతులు స్వీకరించి నివేదికను ప్రాథమికంగా సిద్ధం చేసింది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కంప్యూటరైజేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అది పూర్తి కాగానే కమిషన్ కు డేటా అందిస్తారు. దాని ఆధారంగా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందిస్తుంది. ఆ తర్వాత కేబినెట్ నివేదికపై చర్చించి ఆమోదించి రిజర్వేషన్లను ఖరారు చేస్తుంది. అనంతరం గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను ఖరారు చేసి ఎన్నికల కమిషన్‌కు అందించనుంది. అనంతరం ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేయనుంది.

**ముందు 'గ్రామం'.. తర్వాత 'పట్టణం'...** సర్పంచులు ఎంపీపీ, జడ్పీ చైర్మన్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగిసింది.

వీటిలో ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ముందుగా ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అందుకనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఎంపీటీసీ సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్న మండలాల్లో ఐదింటిని ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీలో చేసిన చట్ట సవరణకు గవర్నర్ ఆమోద ముద్ర వేయగానే ఆ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. మొదట గ్రామీణ స్థానిక సంస్థలు, ఆ తర్వాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహిస్తారు. మున్సిపాలిటీల పదవీ కాలం జనవరి చివరి వారంలో ముగియనున్నది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడ్డ వారందరికీ వివిధ రకాల పదవులు దక్కే విధంగా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం ద్వారా అత్యధికంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పదవులు దక్కనున్నాయి. వీటిని అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నది. గ్రామాలు, పట్టణాల్లో ఎవరెవరితో పోటీ చేయించాలో ఎమ్మెల్యేలు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

# సంపాదకీయం

## ఢిల్లీలో హంగ్... పార్టీలకు ఖంగ్ ?

మరో పది రోజులలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. మొత్తం డెబ్బై స్థానాలు ఉండే శాసనసభకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగుతోంది. అదే నెల 8వ తేదీన ఫలితాలు వెలువడతాయి. ఈసారి ఢిల్లీ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. అధికారంలో ఉన్న ఆప్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీల మధ్య హోరాహోరీగా పోటీ నడుస్తోంది. మధ్యలో కాంగ్రెస్ కూడా చేరింది. ఆ పార్టీకి కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మంచి బలం ఉంది. పదిహేనేళ్ళ పాటు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్ కి కొన్ని వర్గాలలో బలమైన ఓటు బ్యాంక్ ఉంది. దాంతో కీలకమైన అసెంబ్లీ నియోజకవర్గాలలో త్రిముఖ పోరు సాగుతోంది. కాంగ్రెస్ ఈ భీకరమైన పోరులో గెలుస్తుందా అంటే ఏమో తెలియదు కానీ ఆ పార్టీ ఓట్లు గణనీయంగా పట్టుకుని పోతే అది అంతిమంగా ఆప్ అధికారానికి చేటు తెస్తుంది అని అంటున్నారు. ఇక బీజేపీ విషయం తీసుకుంటే 2020 అసెంబ్లీ ఎన్నికల కంటే కూడా ఈసారి బలాన్ని బాగా పెంచుకుంది. డబుల్ ఇంజన్ సర్కార్ అన్న ప్రచారం ఈసారి ఢిల్లీ వీధులలో మారు మోగుతోంది. దాంతో గతం కంటే బీజేపీకి ఎక్కువ ఆదరణ దక్కుతోంది. అయితే అది అధికారం దక్కించుకేటంతగా ఉంటుందా అన్నది చర్చగా ఉంది. ఇక ఆప్ గత పన్నెండేళ్ళుగా నాన్ స్టాప్ గా అధికారంలో ఉంది. ఆ పార్టీ విషయంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు అని అంటున్నారు ఈసారి ఆప్ కి బదులుగా బీజేపీని ఎన్నుకోవాలని భావిస్తున్న వర్గాలు పెరిగాయని చెబుతున్నారు. కేజ్రీవాల్ క్రేజ్ కూడా గతంతో పోలిస్తే తగ్గుతోంది. ఆప్ లో కూడా వర్గ పోరు అధికార పార్టీలో ఉండాల్సిన జాడ్యాలు అన్నీ కూడా కలగలిసి చీపురు పార్టీకి కొత్త భారాన్ని కలిగిస్తున్నాయని అంటున్నారు. అయితే గతంలో దక్కిన 60కి పైగా సీట్లు ఈసారి దక్కకపోయినా సగానికి సగం అయినా ఆప్ కి వస్తాయన్న విశ్లేషణలు ఉన్నాయి. అదే కనుక జరిగితే మాత్రం ఢిల్లీలో మ్యాజిక్ ఫిగర్ అయిన 36 సీట్లు ఏ పార్టీకి దక్కే సూచనలు ఉండవని అంటున్నారు. అపుడు హంగ్ రావచ్చు అని చెబుతున్నారు. కొన్ని సర్వేలు కూడా ఇదే విషయం చెబుతున్నాయి. అయితే ఆప్ కి ఏ ముప్పయి సీట్లో దక్కి కాంగ్రెస్ కి ఆరేడు సీట్లు దక్కినా ఆప్ కాంగ్రెస్ కలసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు అని అంటున్నారు. అదే సమయంలో బీజేపీకి మాత్రం హంగ్ వస్తే ఆ చాన్స్ అసలు ఉండదని అంటున్నారు. బీజేపీ కచ్చితంగా 36 సీట్లకు పైగా తెచ్చుకుంటేనే అధికార పీఠం ఎక్కగలదు. మరి కాంగ్రెస్ ఇక్కడ రాజకీయం మార్చడానికి తగిన భూమికను పోషిస్తోంది. కాంగ్రెస్ తాను బలపడి కొన్ని సీట్లు సాధిస్తే అది ఆప్ కి సహాయంగా ఎన్నికల తరువాత మారవచ్చు. అలా కాకుండా తాను గెలవకుండా ఓట్లు భారీగా చీలిస్తే మాత్రం అది బీజేపీకి ప్లస్ అవుతుంది. అపుడు ఆప్ అధికారానికి దూరం అవుతుంది అని అంటున్నారు. ఈ విధంగా ఢిల్లీ రాజకీయ సమీకరణలు ఉన్న నేపథ్యంలో హంగ్ వస్తే ఎవరు ఖంగు తింటారో అన్నది చర్చగా ఉంది.

## పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో మువ్వన్నెల జెండాలు ఎగరవేస్తూ ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

### ఊరూరా వాడ వాడ జాతీయ జెండాలను ఎగరవేసిన సంబంధిత అధికారులు, నాయకులు





శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను బువ్వన జెండాను ఉరువుర వాడవాడనే ఎగరవేస్తూ ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని తుంకుంట మున్సిపల్, శామీర్ పేట మండలం, మూడు చింతలపల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, విద్యాసంస్థల వద్ద, గ్రామపంచాయతీల వద్ద, మున్సిపల్ వార్డు కార్యాలయాల వద్ద, వివిధ సంఘాల వద్ద, ఆటో స్టాండ్ల వద్ద జాతీయ జెండాను ఎంతో ఉత్సాహంగా ఆవిష్కరించి గణతంత్ర వేడుకలను నిర్వహించారు. శామీర్ పేట మండల రెవిన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ యాదగిరిరెడ్డి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో మమతాబాయి, మూడు చింతలపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ వెంకట నర్సింహారెడ్డి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వత్సల దేవి, మండల విద్యా వనరుల కార్యాలయం వద్ద ఎంఈవో వసంతకుమారి, సబ్ డివిజన్ ఇరిగేషన్ కార్యాలయం వద్ద డీఈఈ శ్రీనివాస్ రావు, మండల మహిళా బ్యాంక్ వద్ద అధ్యక్షురాలు మహేశ్వరి, మండల సెర్ప్ కార్యాలయం భవనం వద్ద ఏపీఎం సురేష్, మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద ఏవో రమేశ్, మూడు చింతలపల్లి వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో రవికుమార్, మండల రైతు సహకార సంఘం వద్ద చైర్మన్ మధుకర్రెడ్డి, పోలీస్ స్టేషన్ వద్ద ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఇంచార్జ్ వైద్యాధికారి శ్రీకాంత్, మండల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఇన్చార్జీ ఎస్ఆర్వో సందీప్, తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ వెంకటగోపాల్, శామీర్ పేట సబ్ డివిజన్ విద్యుత్ కార్యాలయం వద్ద ఏడీఈ అశోక్ రావు, అలియాబాద్ విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద ఏఈ వెంకటనారాయణ, శామీర్ పేట సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద స్టార్, చైతన్య యువజన సంఘాల సభ్యులు, అంగన్వాడి కేంద్రాల వద్ద అంగన్వాడీ టీచర్లు జాతీయ జెండాలను ఎంతో ఉత్సాహంగా ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బంది జాతీయ జెండాలకు వందన సమర్పణ చేస్తు ఎంతో ఉత్సాహంగా జాతీయ గీతాన్ని ఆలపించారు. శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో పంచాయతీల వద్ద కార్యదర్శులు జాతీయ జెండాను ఎగురవేసి ఎంతో ఉత్సాహంగా గణతంత్ర వేడుకలను జరుపుకున్నారు. ఉమ్మడి శామీర్ పేట మండలం లోని వాడవాడల్లో జాతీయ జెండా రెపరెపలాడింది.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు...

### పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అధికారులు ...




శామీర్ పేట, (గరుడ వార్త) : పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్ కుమార్ తెలిపారు. ఆదివారం పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలోని పొన్నాల్, కేశవరం గ్రామాలలో అర్హులైన పలువురు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పన్నాల్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా స్పెషల్ కలెక్టర్ శంకర్ కుమార్, హార్టికల్చర్ ఏడి శ్రీధర్‌లు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భం గా శామీర్ పేట మండలం పొన్నాల్ గ్రామంలో మండల స్పెషలాఫీసర్ శంకర్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ పథకాల కింద ఎంపికైన 647 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రొసిడింగ్ కాఫీలను అందించారు. పొన్నాల్ గ్రామానికి చెందిన 434 మంది రైతులకు రైతు బరోసా పథకం కింద, అలాగే ఇందిరమ్మ ఆత్మీయ బరోస పథకం కింద 19 మంది భూమి లేని వ్యవసాయ కూలీ లబ్ధిదారులకు, ఆహార భద్రత పథకం కింద 114 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువనున్న ఇండ్లు లేని 80 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల ప్రెసిడెంట్ కాపీలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మమతాబాయి, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, జవహర్ నగర్ మేయర్ శాంతికోటేశ్ గౌడ్, మండల వ్యవసాయాధికారి రమేశ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**మూడు చింతలపల్లి మండలంలో....**

మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింలు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంలో ముందు వరసలో ఉందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కార్యకర్తలు చొరవ తీసుకోవాలని కోరారు. పథకాల అమలుకు మూడుచింతలపల్లి మండలంలో కేశవరం గ్రామం ఎంపిక కావడం నాకు గర్వకారణమని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కక్కటిగా హామీలన్ని అమలు చేసుకుంటూ పోతారని చెప్పారు. కేశవరం గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలలో ఎంపిక అయిన లబ్దిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి ఉప సీఈఓ, మండల స్పెషల్ ఆఫీసర్ నీరజ, తహశీల్దార్ వెంకట నరసింహ రెడ్డి, ఎంపీడీఓ వత్సల దేవి, పంచాయతీ సెక్రెటరీ గౌతమి, వ్యవసాయ అధికారులు, హౌసింగ్ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటీసీ హనుమంత రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాధం, నాయకులు గౌనె మహేందర్ రెడ్డి, దోసకాయల వెంకటేష్, లక్ష్మా రెడ్డి, బస్వారెడ్డి, జెర్రిపోతుల నర్సింలు, రవీందర్ రెడ్డి, యూసుఫ్, మల్లేష్ యాదవ్, శేఖర్, వెంకటేష్, జాఫర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లకెన్నేళ్లకు..



కొత్తగూడెం : లిఖితపూర్వక ఒప్పందంతో భూములు కొనుగోలు చేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. తెల్లకాగితాలపై ఒప్పందాల ద్వారా (సాదాబైనామా) 2014 జూన్ 2వ తేదీకి ముందు జరిగిన కొనుగోళ్లను క్రమబద్ధీకరించాలని ఆర్ఓఆర్-2024 చట్టం సెక్షన్ 6(1) కింద నిర్ణయించింది. ఆర్డీఓ స్థాయిలో విచారణ జరిపాక క్రమబద్ధీకరణ ప్రక్రియ నిర్వహించనుంది. ఏళ్ల క్రితం సాదాబైనామా రూపంలో భూములు కొని అనుభవిస్తున్నా.. సరైన పత్రాలు లేకపోవటంతో ప్రభుత్వం వారిని రైతులుగా గుర్తించటం లేదు. గత ప్రభుత్వం వీటిని క్రమబద్ధీకరించటం కోసం దరఖాస్తులు స్వీకరించినా.. వాటిని పరిష్కరించటంలో విఫలమైంది. కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా సాదాబైనామాలకు భూహక్కులు వర్తింపజేస్తామని ప్రభుత్వం తాజాగా ప్రకటించటంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. **ఉభయ జిల్లాల్లో 1,73,960 దరఖాస్తులు**

గత ప్రభుత్వం సాదాబైనామాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. 2014 జూన్ 2లోగా లిఖితపూర్వక ఒప్పందంతో భూములు కొన్న రైతుల దరఖాస్తులకు చట్టబద్ధత కల్పించి పాసుపుస్తకాలు జారీచేయాలని భావించింది. 2020 అక్టోబర్‌లో ప్రకటన వెలువరించి నవంబర్ 10 వరకు దరఖాస్తులు స్వీకరించింది. ఖమ్మం జిల్లాలో 1,11,449, భద్రాద్రి కొత్తగూడెంలో 62,511 మంది దరఖాస్తు చేసుకున్నారు. నాలుగేళ్లుగా వాటికి పరిష్కారం లభించలేదు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో సాదాబైనామా భూములు కలిగిన రైతులకు భూహక్కులు లభించే అవకాశం ఉంది. అయితే ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించటంతో పాటు వీటి పరిష్కారానికి 'భూ-భారతి'లో ప్రత్యేక ఐచ్ఛికం తీసుకొస్తే మార్గం సులువవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

**ధరణి రాకతో బేజారు..** ఏళ్ల క్రితం లిఖితపూర్వక ఒప్పందం ద్వారా భూములు కొన్న రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవటంతో వారందరూ భూహక్కుదారులుగా గుర్తింపు పొందలేకపోయారు. 2020లో వచ్చిన 'ధరణి' వారి సమస్యలను రెట్టింపు చేసింది. అప్పట్లో భూదస్త్రాల్లోని పట్టాభూములు విక్రయించిన వారి పేర్లమీదనే కొత్త పాసుపుస్తకాలు వచ్చాయి. గతంలో వారి పూర్వీకులు విక్రయించిన భూముల పాసుపుస్తకాలు వారసులకు రావటంతో ఆ పొలాలు తమవేనని కబ్జాపెడుతున్నారు. సాదాబైనామా భూముల వివాదాలకు ధరణి కేంద్ర బిందువైంది.

## తూంకుంట మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గా నియమితులైన బి సంధ్య

శామీర్ పేట, (గరుడ వార్త) : తూంకుంట మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గా జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ బి సంధ్యను అధికారులు నియమించారు. నియమితులైన సంధ్య సోమవారం బాధ్యతలను



స్వీకరించారు. తుంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, మున్సిపల్ అధికారులు సంధ్యకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. మున్సిపల్ అధికారులతో స్పెషల్ ఆఫీసర్ సంధ్య మాట్లాడుతూ మున్సిపల్ లోని వివిధ విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారుకార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందుకున్న ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ వాసుదేవ్



శామీర్ పేట, (గరుడ వార్త) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా తన విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఇరిగేషన్ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ వాసుదేవ్ కు ఉత్తమ అవార్డును జిల్లా కలెక్టర్ గౌతం అందజేశారు. ఇరిగేషన్ శాఖలో విధులు నిర్వహిస్తున్న శామీర్ పేట మండల వర్క్ ఇన్స్పెక్టర్ వాసుదేవ్ ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఘనతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ గౌతమ్ అభినందిస్తు ఉత్తమ అవార్డును అందజేశారు.

## ఉద్యోగాల కల్పనకు నైపుణ్య శిక్షణ..!

ములుగు : నిరుద్యోగ యువతకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు ములుగు జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్, నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ దివాకర ప్రత్యేక శ్రద్ధ చూపి ములుగులోని బీసీ బాలుర హాస్టల్ భవనంలో 30 మంది అభ్యర్థులు శిక్షణ పొందేందుకు వీలుగా రెండు గదులను సిద్ధం చేశారు.

**23 వరకు దరఖాస్తుల స్వీకరణ**

నైపుణ్య శిక్షణ కేంద్రంలో ప్రవేశం పొందాలనుకుంటే డిసెంబరు 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. టెక్నికల్, నాన్ టెక్నికల్‌లో శిక్షణ పొందేందుకు డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ వంటి కోర్సులు చదివి, 18 నుంచి 35 ఏళ్ల లోపున్న వారు అర్హులు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలి. పూర్తి వివరాలకు 88862 20324, 94403 48961 నెంబర్లలో కూడా సంప్రదించొచ్చు.

**అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం.. - టీఎస్.దివాకర, కలెక్టర్, ములుగు**

ములుగు పట్టణంలో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఈ



నెలలో ప్రారంభించనున్నాం. రాష్ట్ర మంత్రి సీతక్క చొరవతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడానికి అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం. 25 కంప్యూటర్లు, రెండు ప్రొజెక్టర్లు సమకూర్చాం. దాంతో పాటు హై స్పీడు ఇంటర్‌నెట్, సీసీ కెమెరాలు, ఏసీలు కూడా ఏర్పాటు చేశాం. నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. టాస్క్ అనేది పరిశ్రమకు నాణ్యమైన మానవ వనరుల సేవలను, ప్రభుత్వం, అకాడమీల మధ్య సమన్వయాన్ని తీసుకురావడానికి లాభాపేక్ష లేకుండా ఏర్పాటు చేసిన సంస్థ.

**మూడు విభాగాలుగా..**

కేంద్రంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల్లో ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమాన్ని శిక్షణ-1, శిక్షణ-2, జాబ్ ప్లేస్‌మెంటు ఇలా మూడు భాగాలుగా విభజించారు. ఒక్కో విభాగంలో పది రోజులపాటు తర్ఫీదు ఇచ్చేలా నిర్ణయించారు.

శిక్షణ-1లో.. నైపుణ్యాల పరిచయం, కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్, గణితం తదితర నైపుణ్యాలు.. సి.ప్రోగ్రామింగ్ మూల సూత్రాలు, డేటా బేస్ కాన్సెప్ట్, సమయ నిర్వహణ-ఉత్పాదకత, మాక్ ఇంటర్వ్యూలపై శిక్షణ ఉంటుంది.

శిక్షణ-2లో.. రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూకి తయారీ, కేరీర్ అభివృద్ధి, ఉద్యోగ అన్వేషణ వ్యూహాలు, వ్యక్తిగత బ్రాండింగ్, ఆన్‌లైన్ ఉనికి, సాఫ్ట్ స్కిల్ డెవలప్‌మెంట్, గణిత నైపుణ్యాలపై తర్ఫీదు ఉంటుంది. జాబ్ ప్లేస్‌మెంట్‌లో.. వివిధ రకాల కంపెనీలకు ఉపయోగపడే కోర్సుల్లో శిక్షణ ఉంటుంది. ప్రధానంగా డిజిటల్, సోలార్ టెక్నిషియన్, రిటైల్ సేల్స్, ఆటోమొబైల్, ఐటీ, ఫార్మా, కన్సల్టింగ్, బ్యాంకింగ్, టెలికాం రంగాలకు చెందిన కంపెనీల్లో నియామకమయ్యేలా తయారు చేస్తారు.

# మహా శివరాత్రికి ఏర్పాట్లు

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు అత్యంత వైభవంగా జరిగే మహా శివరాత్రి జాతరకు ఏర్పాట్లు మొదలయ్యాయి. వేడుకలకు దాదాపు 4 లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం దాదాపు రూ. 1.75 కోట్లను వెచ్చిస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాకారాలు, గోపురాలను అగ్నిమాపక యంత్రాలతో శుభ్రం చేసి రంగులు వేసే పనులు మొదలు పెట్టారు. మరోవైపు కోడెల క్యూలైన్ ప్రాంతంలో రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన ద్వారం, ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాల్లో భక్తులు సేదతీరేందుకు, జాగరం చేసేందుకు అవసరమైన చలువ పందిళ్లను వేస్తున్నారు. పనులు వేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇప్పటికే క్యూలైన్లలోని జాలీలకు అక్కడక్కడ వెల్డింగ్ పనులు పూర్తి చేశారు.

**వారం రోజుల ముందే...** మహా శివరాత్రి జాతర ఏర్పాట్లు గతంలో మాదిరిగా కాకుండా వారం రోజుల ముందే పూర్తి చేసేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నెల 8న ఆలయ ఓపెన్ స్లాబ్ వేదికలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ అధికారులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రభుత్వ విప్ ఆది



శ్రీనివాస్ మహా శివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు చేపట్టాల్సిన పనులపై విప్, కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. జాతరకు వచ్చే ఏ ఒక్క భక్తుడికి ఇబ్బంది కలగకుండా స్వామివారి దర్శనం సులువుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు విప్ సూచించారు. దీంతో ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. అనుకున్న సమయానికి ముందే పూర్తి చేసేలా అధికార యంత్రాంగం కార్యాచరణను సిద్ధం చేసింది.

**చేపడుతున్నవి ఇవే...**

రాజన్న ఆలయం, ఆలయ పరిసరాల్లో రూ.37 లక్షలతో తాత్కాలిక పెండాళ్లు నిర్మిస్తున్నారు. దాదాపు రూ.20 లక్షలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. రూ.34 లక్షలతో తాత్కాలిక పనులు, రూ.7.40 లక్షలతో రాజన్న ప్రధాన ఆలయానికి రంగులు, మరో రూ.7.30 లక్షలతో అనుబంధ ఆలయాలకు రంగులు, రూ.8 లక్షలతో ఆర్టీసీ ఆర్చ్ గేట్లు, ఆలయ ధర్మగుండానికి రంగులు, రూ.4.50 లక్షలతో పెండాళ్లకు తెల్లని వస్త్రం, రూ.10 లక్షలతో గుడి చెరువులో భక్తులు సేదతీరేందుకు పెండాళ్లు ఏర్పాటు చేయనున్నారు. రూ.3.80 లక్షలతో మూలవాగులోని బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ వైపు అత్యవసర రోడ్డు నిర్మాణం, రూ.4.50 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాట్లు, రూ. 4.70 లక్షలతో భక్తులకు శుద్ధ జలం సరఫరా, రూ.8.20 లక్షలతో కోడెల క్యూలైన్, క్యూ కాంప్లెక్స్‌కు రంగులు, రూ.5 లక్షలతో ఆలయ పార్కింగ్ స్థలంలో బారికేడ్ల ఏర్పాటు, రూ.9.50 లక్షలతో ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయనున్నాయి. రూ.4.80 లక్షల వ్యయంతో బస్టాండ్ నుంచి పార్కింగ్ స్థలం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నారు. రూ.2 లక్షలతో సౌండ్ సిస్టమ్, రూ.4 లక్షలతో అదనపు సీసీ కెమెరాల ఏర్పాటు వంటివి చేయనున్నారు.కొనసాగుతున్నాయి మహా శివరాత్రి జాతర పనులు కొనసాగుతున్నాయి. ఇప్పుడిప్పుడే పనుల్లో వేగం పుంజుకుంది. ముందుగానే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.రఘునందన్, డీఈ, రాజన్న ఆలయం

## భారం తగ్గేలా.. వేగం పెరిగేలా..

మెదక్ : రెండేళ్ల కిందట రెండు జిల్లాలకు నూతన రైలు మార్గం ఏర్పాటైంది. గూడ్స్, ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు, రిజర్వేషన్ సౌకర్యంతో ఇరు జిల్లాలకు ప్రయాణం సులువైంది. ఆయా మార్గాల్లో డీజిల్‌తో రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ భారాన్ని తగ్గించేందుకు, కాలుష్య నివారణకు ఆ రూట్లలో విద్యుదీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మార్గంలో పనులు పూర్తయ్యాయి. మరో వైపు చేపట్టేందుకు నిధులు కేటాయించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ఉన్న సమయంలో జహీరాబాద్‌కు రైలు మార్గం ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక మెదక్, సిద్దిపేట జిల్లాలకు రైల్వేలైన్ ఏర్పాటైంది. గతంలో మెదక్ జిల్లాలో మనోహరాబాద్ నుంచి రామాయంపేట మండలం అక్కన్నపేట వరకు 38 కిలోమీటర్లు ఉండగా, అక్కన్నపేట నుంచి మెదక్ వరకు 17.2 కి.మీ.ల మార్గం 2022 ఆగస్టులో ఏర్పాటైంది. సిద్దిపేట జిల్లాకు రెండేళ్ల కిందట లైన్ అందుబాటులోకి వచ్చింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా పెద్దపల్లి జిల్లా కొత్తపల్లి వరకు రైలు మార్గం మంజూరు కాగా, సిద్దిపేట వరకు 76 కి.మీ.ల లైన్ ఏర్పాటై ప్యాసింజర్ రైలును నడిపిస్తున్నారు.

**మెదక్‌లో 38 కిలోమీటర్ల మేర డబ్లింగ్..**

సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ల నుంచి మేడ్చల్ వరకు డబ్లింగ్ రైలు మార్గం ఉంది. అక్కడి నుంచి జిల్లాకు వచ్చే మార్గంలో సింగిల్ లైన్ ఉండడంతో మేడ్చల్ –ముద్కేడ్ మార్గంలో నడిచేరైళ్లను ఆయా స్టేషన్లలో ఆపాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఈ లైన్‌ను డబుల్‌గా మార్చనున్నారు. మనోహరాబాద్ నుంచి అక్కన్నపేట వరకు 38 కిలోమీటర్ల మార్గం కూడా డబుల్ లైన్ కానుంది. దీంతో రైళ్లు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. క్రాసింగ్‌కు వేచి ఉండే పరిస్థితి తప్పనుంది.

**మనోహరాబాద్ -సిద్దిపేట మార్గంలో..**

మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైలు మార్గం 2023లో అందుబాటులోకి వచ్చింది. ఈ లైన్ సిరిసిల్ల మీదుగా కొత్తపల్లి వరకు నిర్మించనున్నారు. ప్రస్తుతం గజ్వేల్ మీదుగా సిద్దిపేట పట్టణం వరకు రైలు నడుస్తోంది. ఈ మార్గాన్ని విద్యుదీకరణ చేయాలని అధికారులు నిర్ణయించి, రూ.105 కోట్లు కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

**38 కి.మీ. పూర్తి..**మెదక్ జిల్లాలో ఇది వరకు 38 కిలోమీటర్ల రైలు మార్గం విద్యుదీకరణ పూర్తయింది. రెండేళ్ల కిందట అక్కన్నపేట నుంచి మెదక్ వరకు రైలు మార్గం అందుబాటులోకి వచ్చింది. జిల్లాలో మనోహరాబాద్ నుంచి అక్కన్నపేట వరకు ఉన్న లైన్ గతంలోనే విద్యుదీకరణ పూర్తయింది. అక్కన్నపేట నుంచి మెదక్ వరకు నడిచే రైళ్లు డీజిల్‌తో నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఈ మార్గాన్ని విద్యుదీకరణ చేయాలని నిర్ణయించారు. గతేడాది ఆగస్టులో పనులు ప్రారంభమై ఇటీవల పూర్తయ్యాయి. ఇందుకు రూ.15.49 కోట్ల వ్యయం అయ్యింది. అక్కన్నపేట–మెదక్ లైన్ మార్గం ఏర్పాటుతో రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో శతశాతం విద్యుదీకరణ పూర్తయింది. ట్రయల్ రన్ విజయవంతమైంది.

# ప్రత్యేక తరగతులు.. కాలే కడుపులు



హయత్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఉత్తీర్ణత పెంచడానికి ఆయా సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు బడిలోనే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. విద్యార్థులు కాలే కడుపులతోనే హాజరవుతున్నారు. ఉదయం పూట అల్పాహారం అందక నకనకలాడుతున్నారు. ప్రత్యేక తరగతుల్లో ఒక్కో రోజు ఒక్కో పాఠ్యాంశంపై ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు.

**దాతలు.. సర్కారు ముందుకురావాలి**

గతంలో అల్పాహారం అందించేందుకు స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు ముందుకొచ్చేవారు. కొన్ని స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే తలా కొంత వేసుకొని అల్పాహారం అందించిన దాఖలాలు ఉన్నాయి.పూర్వ విద్యార్థులు, యువజన సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకొస్తే విద్యార్థుల ఆకలి తీరుతుంది.

**ఆకలికి తట్టుకోలేక..**

రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలో మొత్తం పదో తరగతి విద్యార్థులు 1,71,067 మంది ఉన్నారు. వీరంతా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. ఇదిలా ఉంటే ప్రత్యేక తరగతులు ఉదయం 8 గంటలకే కావడంతో నిరుపేద విద్యార్థులు ఎలాంటి అల్పాహారం తీసుకోకుండానే బడికి వస్తున్నారు. కడుపులో ఏమీలేక తరగతులపై దృష్టి పెట్టలేని పరిస్థితి. పిల్లలకు అల్పాహారం, బిస్కెట్లు అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఫిబ్రవరి మొదటి వారం నుంచి అల్పాహారం అందిస్తాం**

– సుశీందర్‌రావు, డీఈవో, రంగారెడ్డి జిల్లా

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ఒక్కో గంట చొప్పున పునశ్చరణ చేయిస్తున్నాం. అల్పాహారం విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి.. ఫిబ్రవరి మొదటి వారం నుంచి అందించాలని కార్యాచరణ రూపొందిస్తున్నాం.

# ఆరోగ్య అవగాహన.. పరిసరాల శుభ్రత



గోదావరిఖని : వైద్య విద్యార్థుల్లో సామాజిక సేవా దృక్పథాన్ని పెంచాలనే లక్ష్యంతో జాతీయ వైద్య కౌన్సిల్ చేపట్టిన 'కుటుంబ దత్తత' సత్ఫలితాలనిస్తోంది. వైద్య విద్యలో మొదటి రెండున్నరేళ్లు 'కమ్యూనిటీ మెడిసిన్' కోర్సును పొందుపరిచారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఎంపిక చేసిన గ్రామంలోని అయిదు కుటుంబాలను దత్తత తీసుకొని వారి ఆరోగ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలల వైద్య విద్యార్థులు గ్రామాలను దత్తత తీసుకొని వారి జీవన విధానాల్లో మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు.

**జీవన శైలిలో మార్పులే లక్ష్యంగా...**

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో మొదలయ్యే కుటుంబ దత్తత ప్రక్రియ రెండున్నరేళ్లపాటు కొనసాగుతుంది.

దత్తత తీసుకోగానే విద్యార్థులు ఆయా కుటుంబాల ఆరోగ్య పరిస్థితి, పరిసరాలు, జీవన విధానాలపై నివేదిక సిద్ధం చేసుకుంటారు. రెండున్నరేళ్ల తర్వాత కుటుంబాల స్థితిగతుల్లో వృద్ధి కనిపించాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులు ఆరోగ్య పరిస్థితులు, ఆహార అలవాట్లు, ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశీలిస్తారు. మద్యం, ధూమపానం, జూదం తదితర దురలవాట్లు ఉంటే నమోదు చేసుకుంటారు. అవసరమైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తారు. వ్యసనాల నుంచి దూరం చేసేందుకు అవగాహన కల్పిస్తుంటారు.

మహిళలు, గర్భిణుల్లో రక్తహీనత ఉంటే అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ద్వారా పోషకాహారంపై అవగాహన కల్పించడంతోపాటు ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటారు. గర్భిణులు, పిల్లలు వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవడం, అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగిస్తారు.ఇంట్లోకి గాలి, వెలుతురు సరిగా వచ్చేలా ఏర్పాట్లు చేయిస్తారు. ఆవరణలో పండ్లు, పూల మొక్కలను నాటేలా చూస్తారు. దోమలు వృద్ధి చెందకుండా పరిశుభ్రత పాటించడం, ఇంకుడు గుంతల తవ్వకంపై దృష్టి సారిస్తారు.

నెలకోమారు తమకు కేటాయించిన అయిదు కుటుంబాలను వైద్య విద్యార్థులు కలుస్తూ సూచనలు ఇస్తుంటారు. అవసరమైతే ప్రత్యేక వైద్య నిపుణులతో ఆయా గ్రామాల్లో మెగా వైద్య శిబిరాలు నిర్వహించి మందులు సరఫరా చేస్తారు.

ప్రజల ఆరోగ్య వివరాలు తెలుస్తాయి

కమ్యూనిటీ మెడిసిన్‌లో భాగంగా కుటుంబాన్ని దత్తత తీసుకొని ప్రజల ఆరోగ్య క్షేమాలు తెలుసుకొని సలహాలు ఇవ్వడం ఆనందంగా ఉంది. దత్తత కుటుంబాన్ని ఇప్పటి వరకు నాలుగుసార్లు సందర్శించాను. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించాను. ప్రజలకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందించవచ్చని తెలుసుకున్నాను.అద్వైత వర్షిణి, కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల


**ప్రజలతో మాట్లాడితే తెలుస్తుంది**

దత్తత కుటుంబంలోని సభ్యులతో మాట్లాడినప్పుడు తరగతి గదిలోని నేర్చుకున్న పాఠాలు గుర్తుకొచ్చి వారి ఆరోగ్య పరిస్థితి తెలుస్తుంది. అనారోగ్యానికి గురయ్యే ముందు శరీరం చూపించే సంకేతాలను కుటుంబ సభ్యులు చెప్పినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించాను. వారు చూపించే ఆదరణ మాటల్లో చెప్పలేనిది.సాయి కశ్యప్ శ్రీకర్, కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాల

# రామగుండంలో అవినీతి చేపలు

గోదావరిఖని : రామగుండం నియోజకవర్గంలో అవినీతి చేపలు అనిశా అధికారులకు చిక్కుతున్నాయి. రెండు నెలల్లో ముగ్గురిని అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. రెండు నెలల క్రితం అంతర్గాం తహసీల్దార్ రమేశ్‌ను పటుకున్న అనిశా అధికారులు తాజాగా రామగుండం ఎస్టీవో మహేశ్వర్, సహాయకుడు పవన్‌సాయిలను వలపన్ని పట్టుకున్నారు. రామగుండం ప్రాంతంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లంచాల బాగోతం జోరుగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక సార్లు అనిశా అధికారులు అవినీతి ఆరోపణలు ఉన్న అధికారులను పట్టుకునేందుకు వలపన్నారు. విషయం తెలుసుకున్న కొంత మంది ముందుగానే పసిగట్టి అక్కడి నుంచి జారుకున్న సందర్భాలున్నాయి. ఇప్పటికీ ప్రజా సంబంధాలున్న ప్రభుత్వ శాఖల్లో లంచం ఇవ్వనిదే పనిచేయడం లేదన్న ఆరోపణలున్నాయి. వాటిపై అనిశా అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పలు శాఖల్లో...**రామగుండం ప్రాంతంలో మరికొన్ని అవినీతి తిమింగలాలున్నాయనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో ఏడాదిన్నర వ్యవధిలోనే రెండు సార్లు ఇక్కడ పని చేసిన ఇద్దరు తహసీల్దార్లను అనిశా అధికారులు పట్టుకున్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితుల నుంచి లంచాలు డిమాండ్ చేయడంతో బాధితులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు. భూమి హద్దులు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూ వివాదాల పరిష్కారం విషయమై పలువురు అధికారులు, సిబ్బందికి చెల్లింపులు తప్పనిసరిగా మారుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అంతర్గాం తహసీల్దార్



కార్యాలయంలో గతంలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కారు. ఒక ఆర్ఐ ఆ సమయంలో పరారయ్యారు. తాజాగా విశ్రాంత ఉపాధ్యాయుల పింఛను విషయంలో ఉప కోశాగార కార్యాలయంలో పని చేసే ఎస్టీవో డబ్బులు డిమాండ్ చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మరికొన్ని ప్రభుత్వ శాఖల్లో కూడా లంచాల బాగోతం సాగుతోందన్న ఆరోపణలున్నాయి. రామగుండం వీఆర్‌వోలు లంచం డిమాండ్ చేయడంతో అనిశా అధికారులు 2018 సంవత్సరంలో పట్టుకున్నారు.రామగుండం నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటు ఉండగా అనిశా అధికారులు 2021లో వల పన్ని పట్టుకున్నారు. అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో భూ సర్వే కోసం రైతు నుంచి డబ్బులు డిమాండ్ చేసిన తహసీల్దార్‌ను 2024లో పట్టుకున్నారు.

# వస్త్రంలో కొత్త రకం... ఉపాధి బహుముఖం

సిరిసిల్ల : జిల్లా వస్త్ర పరిశ్రమలో కాటన్ కెస్మెట్ రకం ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఆ స్థానంలో పాపిలిన్ రకం వచ్చింది. ఏడాదిగా నేతన్నలు ప్రైవేటు ఉత్పత్తులతో ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. జిల్లాలో ఆరు నెలల క్రితం పాపిలిన్ వస్త్రం తయారీ రోజుకు లక్ష మీటర్లకు మించేదికాదు. ప్రస్తుతం మూడు లక్షలకు చేరింది. మహిళల అండర్ గార్మెంట్ల తయారీకి ఉపయోగించే పాపిలిన్‌కు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో డిమాండ్ ఉంది. ఆయా రాష్ట్రాల నుంచి ఆర్డర్లు పెరుగుతున్నాయి. ఈ అవకాశాన్ని తీసుకుని సిరిసిల్ల మహిళలు గార్మెంట్ల తయారీతో సొంత వ్యాపారాలతో రాణిస్తున్నారు. సిరిసిల్లలో మహిళలు బీడీలు చుట్టడం, పురుషులు మరమగ్గాల్లో పని చేస్తుండేవారు. కొంతకాలంగా బీడీలతో ఉపాధి తగ్గింది. ప్రత్యామ్నాయంగా గార్మెంట్ వస్త్రాల తయారీ వైపు మళ్లుతున్నారు.

**40 యూనిట్లు.. పది వేల మంది మహిళలు**

మహారాష్ట్రలోని ఇచల్‌కరంజి, తమిళనాడులోని ఈరోడ్, గుజరాత్‌లోని సూరత్ కాటన్ పాపిలిన్ ఉత్పత్తులకు ప్రసిద్ధి. పదేళ్ల క్రితం మన జిల్లాలోనూ కాటన్ మగ్గాలపై నెలకు సగటున 20 లక్షల మీటర్లు ఉత్పత్తి జరిగేది. కానీ ఇక్కడి వస్త్రం అద్దకం, సైజింగ్, ప్రెసింగ్‌కు రాజస్థాన్‌లో బల్మోత్రాలోని యూనిట్లకు వెళ్లేది. అక్కడి నుంచి మహారాష్ట్ర, కర్ణాటకలోని గార్మెంట్ యూనిట్ల నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. ఇప్పుడా వ్యాపార పద్ధతిని సిరిసిల్ల పట్టణంలోని మహిళలు



అవలంబిస్తున్నారు. అద్దకం, సైజింగ్, ప్రెసింగ్ అయిన వస్త్రాన్ని బల్మోత్రా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ వస్త్రంతో అండర్ గార్మెంట్స్ పెట్టీకోట్స్, బ్లౌజ్‌లు, పాల్స్, నైటీలు కుట్టిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటిని కొనుగోలు చేసేందుకు హోల్‌సేల్ వ్యాపారులు పెరిగారు. సిరిసిల్ల పట్టణంలో ప్రస్తుతం 40 గార్మెంట్ యూనిట్లు విస్తరించాయి. ఏడాదిలో ఏడు నెలల పాటు పది వేల మంది మహిళలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

**నిరంతరాయంగా పని**

దిగుమతి చేసుకున్న వస్త్రాన్ని కత్తిరించడం, కుట్టడం మొదలు ప్యాకింగ్, రవాణా వరకు సీజన్, అన్ సీజన్ అని లేకుండా నిరంతరాయంగా పని ఉంటుంది. వస్త్రాల కోసం రాష్ట్రం నలుమూలల నుంచి జిల్లాలోని గార్మెంట్ యూనిట్లకు ఆర్డర్లు వస్తున్నాయి. మా యూనిట్‌లో 50 మంది ఉపాధి పొందుతున్నారు. పట్టణ వ్యాప్తంగా గార్మెంట్ యూనిట్లు విస్తరించాయి. కీర్తన, గార్మెంట్ యూనిట్ యజమాని

**ఆర్థిక అవసరాలు తీరుతున్నాయి**

ఆరు నెలల క్రితమే వస్త్రం కత్తిరించడం, కుట్టడంలో శిక్షణ తీసుకున్నాను. ప్రస్తుతం లంగాలు కుడుతున్నాను. రోజుకు మనం ఎన్ని వస్త్రాలు కుడితే అంత చెల్లిస్తారు. నెలకు సగటున రూ.8 వేల వరకు వస్తుంది. ఉన్న ఊరిలోనే ఉపాధి లభించడంతో ఇంటి ఆర్థిక అవసరాలు తీరుతున్నాయి.శిరీష, మహిళ

**చదువుతూనే పని చేస్తున్నా**

ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాను. మధ్యాహ్నం కళాశాలకు వెళ్లే వరకు ఇక్కడ పని చేస్తాను. సెలవు రోజుల్లో చదువుతోపాటు వస్త్రాలు కుట్టడంతో ఉపాధి పొందుతున్నాను. రెండేళ్ల క్రితం కుట్టు శిక్షణ తీసుకున్నాను. స్రవంతి, యువతి

# రెండు విడతలు.. శతశాతానికి బాటలు

సంగారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఎలా సిద్ధమవుతున్నారో తెలుసుకునేందుకు సాధన(ప్రాక్టీస్) పరీక్షలు రెండు సార్లు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే మొదటి పరీక్ష కోసం పేపర్లను ఎమ్మార్సీలకు పంపించారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే వీటిని నిర్వహించనున్నారు.

**మార్కుల ఆధారంగా ప్రత్యేక శ్రద్ధ**

పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. జనవరి 2వ



తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు 52 రోజుల ప్రణాళికను అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం 8.15 నుంచి 9.15, సాయంత్రం 4.15 నుంచి 5.15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం నిర్దేశించిన ప్రత్యేక షెడ్యూలును అమలు చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు ప్రారంభించిన 25 రోజులకు ప్రాక్టీస్–1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే వీటికి సంబంధించిన ప్రశ్న పత్రాలు ఎమ్మార్సీ కార్యాలయాలకు వచ్చాయి. వీటిని పాఠశాలలకు పంపిణీ చేయాల్సి ఉంది. వార్షిక పరీక్షల మాదిరిగానే ఈ పరీక్షలు నిర్వహించాలి. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రూపులుగా విభజిస్తారు. తక్కువ మార్కులు వచ్చిన వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ప్రత్యేకంగా చదివిస్తారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే రెండో ప్రాక్టీస్ పేపర్ పరీక్షలకు సిద్ధం చేస్తారు. ఇందులో ప్రతి విద్యార్థి 80 శాతం మార్కులు సాధించమే లక్ష్యంగా నిర్దేశించారు. అందులోనూ వెనకబడితే వార్షిక పరీక్షలకు ప్రత్యేకంగా చదివించి సిద్ధం చేస్తారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది.

పరీక్షలకు సిద్ధం చేయాలి

జనవరి 25 నుంచి జరిగే ప్రాక్టీస్–1 పరీక్షలకు విద్యార్థులను ఉపాధ్యాయులు సిద్ధం చేయాలి. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఫిబ్రవరిలో జరిగే ప్రత్యేక తరగతుల్లో బోధన చేయాలి. తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి.

పాఠశాలలు: 270 (ప్రభుత్వ, ఆదర్శ, కస్తూర్బా, గురుకులాలు)

విద్యార్థులు: 12,825

# వడపోద్దాం.. వాడేద్దాం

హైదరాబాద్ : నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన మురుగునీరు పునర్వినియోగంతో నీటి కొరతకు కొంతమేర పరిష్కారం చూపేందుకు జలమండలి కార్యాచరణను సిద్ధం చేసింది. బల్దియాలో నీటి అవసరాలు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తోంది. నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)ల నిర్వహణను ప్రత్యేకంగా పరిశీలించనుంది. వీటిని నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవడంతో పాటు మురుగుజలాలను శుద్ధి చేసి వాటిని తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాల్సి ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇలాంటి ఎస్టీపీలు నగరంలో వెయ్యిదాకా ఉన్నట్లు జలమండలి గుర్తించింది. ఇవి పనిచేస్తున్నాయా? లేదా? పని చేస్తే ఏ ప్రమాణాల మేర శుద్ధి చేస్తున్నారు? ఆ నీటిని వినియోగిస్తున్నారా? లేదా? అనే అంశాలు పరిశీలించనుంది.

**పనితీరు మదింపు**



నగరంలోని ప్రైవేటు ఎస్టీపీలను గుర్తించి డేటాను రూపొందించడంతో పాటు వాటి పనితీరును థర్డ్‌పార్టీతో మదింపు చేసేందుకు జలమండలి రంగం సిద్ధం చేసింది. వందశాతం నిబంధల మేరకు నిర్వహించాలని జలమండలి ఇప్పటికే గేటెడ్ కమ్యూనిటీలను ఆదేశించింది. ఆస్కి లేదా ఈపీటీటీఆర్‌ఐ వంటి సంస్థలతో ప్రైవేటు ఎస్టీపీలను మదింపు చేయనున్నారు. నిబంధనల మేరకు లేని గేటెడ్ కమ్యూనిటీలపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే జరిమానా విధించాలని జలమండలి భావిస్తోంది.

**50 శాతం రాయితీ..**

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిబంధనల మేరకు శుద్ధి చేసిన మురుగునీటి జలాలను కనీసం 50 శాతం పునర్వినియోగించుకోవాలి. ఇటీవల జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి నగరంలోని బిల్డర్లతో సమావేశమైనప్పుడు గేటెడ్ కమ్యూనిటీల్లోని ఎస్టీపీల నిర్వహణపై ప్రత్యేకంగా చర్చించారు. నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్రమాణాలను జలమండలి పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో ఎస్టీపీలను ఏర్పాటు చేసుకున్నవారికి సీవరేజీ ఛార్జీల్లో 50 శాతం దాకా రాయితీ ఇవ్వనున్నారు.

# అభయహస్తంపై ఆశలు

పెద్దపల్లి : కొన్నేళ్లుగా నిలిచిపోయిన అభయ హస్తం సొమ్ము చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన ఖాతాదారులకు ఊరట కలిగిస్తోంది. ఈ మేరకు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న స్వయం సహాయక మహిళలకు ఇబ్బందులు తీరనున్నాయి. నెలాఖారులోపు అర్హుల ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా రూపొందించనున్నారు. దశాబ్ద కాలం తర్వాత మహిళలు పొదుపు చేసిన సొమ్ము తిరిగి జమ కానుండటంతో హర్షం వ్యక్తమవుతోంది.

**పింఛను.. ఉపకార వేతనాలు**

స్వశక్తి సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. సంఘంలో చేరిన ప్రతి మహిళ ఏడాదికి రూ.365 చొప్పున ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం మరికొంత నగదు జమచేసేది. 60 ఏళ్లు దాటిన మహిళలకు ప్రతి నెలా రూ.500 పింఛను చెల్లించాలన్నది లక్ష్యం. అలాగే కుటుంబంలో 9, 10 తరగతులు, ఇంటర్, ఐటీఐ చదివే విద్యార్థులు ఉంటే ఏడాదికి రూ.1200 చొప్పున ఇద్దరు పిల్లలకు ఉపకార వేతనాలు అందించేవారు. అభయ హస్తం



లబ్ధిదారులు సహజ మరణం పొందితే రూ.30 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.70 వేల పరిహారాన్ని కుటుంబాలకు అందించేవారు.

**పదేళ్లుగా నిరీక్షణ**

2014లో రాష్ట్ర పునర్విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని నిలిపివేసింది. ఆసరా పథకాన్ని ప్రారంభించి పింఛను సొమ్ము రెట్టింపు చేసింది. అంతకుముందు అభయహస్తం పథకానికి పదేళ్ల పాటు కట్టిన డబ్బులు తిరిగి చెల్లిస్తామని పలుమార్లు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. 60 ఏళ్లు దాటిన మహిళల్లో చాలా మందికి అటు ఆసరా, ఇటు అభయహస్తం సొమ్ము అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవిత చరమాంకంలో ఆర్థిక భరోసా ఇస్తుందని ఆశించిన మహిళలు నిరాశకు గురవుతున్నారు.

**మొత్తం 3,34,232 మంది**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 3,34,232 మంది మహిళలు అభయహస్తం పథకానికి ప్రీమియం సొమ్ము చెల్లించారు. వీరిలో ఎంతమంది 60 ఏళ్లు పైబడి ఉన్నారో క్షేత్ర స్థాయిలో సెర్ప్ అధికారులు తేల్చనున్నారు. మృతుల పేర్లను జాబితా నుంచి తొలగించి, గ్రామాల వారీగా వివరాలు సేకరించనున్నారు. ఈ మేరకు అర్హుల లెక్క తేలనుంది. స్వశక్తి సంఘాల్లోని మహిళల ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించనున్నారు. గతంలో మాదిరిగానే పిల్లలకు ఉపకార వేతనాలు అందనున్నాయి.నాలుగేళ్లు క్రమం తప్పకుండా చెల్లించా..మా సంఘంలో నాలుగేళ్లు క్రమం తప్పకుండా ఏడాదికి రూ.365 చొప్పున చెల్లించా. నాకు 60 ఏళ్లు దాటడంతో అభయహస్తం పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా. మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.కనకమ్మ, కమాన్‌పూర్ మండలం

# భద్రతతోనే భరోసా.. భవిత



హైదరాబాద్: అల్వాల్‌కు చెందిన ఓ మహిళ డబ్బు కోసం సొంత కూతుర్ని వ్యభిచార కూపంలోకి దింపాలని పథకం వేసింది. తల్లి వేధింపులు ఎక్కువవడంతో బాలిక ఇంటి నుంచి పారిపోయి పోలీసుల్ని ఆశ్రయించింది. తల్లిని అరెస్టు చేశారు. మియాపూర్ బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఒకడు స్నేహం పేరుతో దగ్గరై పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరక అవసరం తీర్చుకున్నాడు. బాలిక పెళ్లి చేసుకోమంటే చంపి మృతదేహాన్ని శివారులో పారేశాడు. ఇంటి పక్కన ఆరేళ్ల బాలిక మీద కన్నేసిన ఓ యువకుడు ఎవరూ లేని సమయం చూసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో పారిపోయి చివరకు పోలీసులకు చిక్కాడు. బాలికలపై జరుగుతున్న ఘోరాలకు మచ్చుతునకలీ ఘటనలు. ఓవైపు కిశోర బాలికల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా.. చట్టపరంగా ఎన్నో రక్షణలున్నా దారుణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బాలికల అమాయకత్వం ఆసరాగా ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. స్నేహం, ప్రేమ పేరుతో ముగ్గులోకి దించుతున్న నేరగాళ్లు అవసరం తీరాక దారుణాలకు తెగబడుతున్నారు. రాష్ట్రంలో గతేడాది నమోదైన అత్యాచార కేసుల్లో 69 శాతం 18 ఏళ్లలోపు బాలికలే బాధితులు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నేపథ్యంలో వారి సంరక్షణకు పోలీసులు, నిపుణులు జాగ్రత్తలు సూచిస్తున్నారు.

**బాలికలూ.. ఈ జాగ్రత్తలు ముఖ్యం**

యుక్త వయసులో ఎక్కువ మంది ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, ఫేస్‌బుక్ వాడుతుంటారు. వాటిల్లో వ్యక్తిగత ఫొటోలు పెట్టొద్దు. కళాశాలలో, పాఠశాలలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు ఎదురైనా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలి.

కొందరు విపరీతంగా డబ్బు ఖర్చు చేస్తూ అడిగినవి తెచ్చిపెడుతూ ముగ్గులోకి దించుతారు. ఇలాంటివి మోసమని గుర్తించాలి.


కొత్తగా స్నేహం, డేటింగ్ యాప్‌లు వస్తున్నాయి. వాటి ద్వారా సరదా కోసమని అపరిచితులతో స్నేహం చేయొద్దు.

**తల్లిదండ్రులూ.. స్నేహంగా మెలగండి**

బాలికలకు చిన్నతనం నుంచే మంచి, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్)లు, ఇతరులతో ప్రవర్తించాల్సిన పరిమితుల గురించి స్పష్టంగా చెప్పాలి. అపరిచితులు, తెలిసినవారు, సొంత కుటుంబ సభ్యులైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే చెప్పేలా ప్రోత్సహించాలి.

పిల్లలతో తల్లిదండ్రులు స్నేహితుల్లా ప్రవర్తిస్తేనే వారు మనసులో మాట బయటపెడతారు. మంచి, చెడు ఏం చెప్పినా సావధానంగా వినాలి. దారి తప్పుతున్నట్లు తెలిస్తే కటువుగా కాకుండా దుష్పరిణామాలు వివరిస్తూ నచ్చజెప్పాలి. పాఠశాల, కళాశాలలో వేధింపులు ఎదురైనప్పుడు ఇంట్లో చెబితే ఏం జరుగుతుందోనని భయంతో 60 శాతం మంది పిల్లలు మిన్నకుండిపోతారు. ఆ తర్వాత పరిస్థితి శ్రుతి మించి అనర్థాలకు దారి తీస్తుంది. అందుకే ఎవరైనా ప్రేమ, స్నేహం పేరుతో పరిచయమైనప్పుడు తల్లిదండ్రులకు నిర్భయంగా చెప్పేలా ప్రోత్సహించాలి. హాస్టల్‌లో ఉండి చదువుతున్న వారిని వీలైనప్పుడల్లా వెళ్లి కలిసి వారి మనోగతాన్ని తెలుసుకోవాలి. వారు అక్కడ ఎలా ఉంటున్నారో తెలుసుకోవాలి. స్మార్ట్ ఫోన్లలో ఏం చేస్తున్నారు.. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరితో మాట్లాడుతున్నారో గమనించాలి. హద్దు మీరినట్లు తెలిస్తే పరిమితులేంటో చెప్పాలి.

# బాలలతో పని చేయిస్తే తప్పదు కేసు



కరీంనగర్ : హుజూరాబాద్‌లోని రంగాపూర్‌లో ఇటుక బట్టీలో ఆపరేషన్ స్మైల్ బృందం తనిఖీలు చేయగా.. అక్కడ ఓ బాలుడు(15) పని చేస్తూ కనిపించాడు. వివరాలు తెలుసుకొని.. బాలుడితో కఠినమైన పనిచేయిస్తున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేయించారు. కరీంనగర్‌లోని కమాన్ సమీపంలో ఓ హోటల్‌లో రాజస్థాన్‌కు చెందిన బాల కార్మికుడు(14) ఉన్నట్లు సమాచారం మేరకు బృందం తనిఖీ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేయించింది.

**ఎంతోమందిలో వెలుగునింపి..**

తప్పిపోయినవారు, భిక్షాటన చేసే పిల్లలను గుర్తించి.. అనాథ పిల్లలను శిశు రక్షణ కేంద్రాల్లో చేర్పిస్తారు. మరికొందరిని వారి తల్లిదండ్రుల దరికి చేర్చడంతోపాటు చదివించేందుకు బాలల సంక్షేమ సమితి సహకారంతో పోలీసుశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపింది.

**ఏటా జనవరిలో..**

2015 నుంచి ఏటా జనవరి 1 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతోంది. పోలీసుశాఖ, మహిళా శిశు సంక్షేమ, కార్మిక శాఖలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపడతారు. ఈ నెలలో జిల్లాలో మూడు బృందాలు 23 మంది పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వారితో పని చేయించిన యజమానులపై కేసులు నమోదు చేశారు.

**ప్రధాన ఉద్దేశం**

లైంగిక దాడుల నుంచి విముక్తి, మానవ అక్రమ రవాణా నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు, మత్తుకు బానిసయ్యే వారిని సమాజంలో కలిపి బాధ్యతాయుతంగా మెదిలేలా చేయడంతోపాటు వారికి నాణ్యమైన విద్య అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. 18 ఏళ్ల వరకు ఉచిత విద్య, సంరక్షణ కల్పించనున్నారు. తల్లిదండ్రుల వద్దకు పంపిన పిల్లలు చదువుకుంటున్నారా లేదా అని సభ్యులు ఆరా తీస్తారు.

**ఆపరేషన్ స్మైల్ బృందం సభ్యులు వీరే..**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, హుజూరాబాద్ ఒక్కో డివిజన్‌లో ఒక ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు (ఒక మహిళ, ఇద్దరు పురుషులు), ముగ్గురు ఎస్సైలు, 9 మంది కానిస్టేబుళ్లు, కార్మికశాఖ అధికారి, బాలల పరిరక్షణ సమితి ఉద్యోగి, ఛైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి ఆపరేషన్ స్మైల్ బృందంలో ఉంటారు. స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సహాయం తీసుకుంటూ బాలలను గుర్తిస్తారు. ఇలా డివిజన్ల వారీగా గుర్తించిన పిల్లలను బాలల పరిరక్షణ సమితి ఎదుట హాజరుపరిచి బాలల సంరక్షణ సమితి సభ్యులు కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎవరూ లేని పిల్లలను శిశు రక్షణ కేంద్రాల్లో చేర్పించారు. తల్లిదండ్రుల వద్దకు పంపిన పిల్లలు చదువుకుంటున్నారా.. ఎలా చదువుతున్నారని సమితి సభ్యులు పర్యవేక్షిస్తారు.

**కేసుతోపాటు జరిమానా**

18 ఏళ్లలోపు పిల్లలను పనిలో చేర్చుకుంటే యజమానులపై కేసు, రూ.25 వేల జరిమానా విధిస్తాం. బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలి. బలవంతంగా పిల్లలను పనిలో చేర్పిస్తే తల్లిదండ్రులు సైతం శిక్షార్హులు అవుతారు. కె.సబితా కుమారి, జిల్లా సంక్షేమ అధికారి

**బాలల రక్షణకు 1098 హెల్ప్‌లైన్**బాల కార్మికుల గుర్తిస్తే 1098కి సమాచారం అందించండి. సమాచా రం ఇచ్చినవారి పేరు గోప్యంగా ఉంచుతాం. సొంత దుకాణాల్లోనూ పాఠశాల సమయంలో బాలలు పని చేయకూడదు. తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాలి.సంపత్, ఛైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్

# పొలం దారి.. ఇక రహదారి



వికారాబాద్ : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈక్రమంలోనే నిరంతరం చేసే పనులకు బదులుగా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రధానంగా ప్రజోపయోగకరమైన పనులు చేపట్టాలని భావించింది. ఇందుకోసం గ్రామాల వారీగా ప్రత్యేక పనులను గుర్తించి అమలుకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ పొలాలకు దారులను ఏర్పాటు చేయడం ద్వారా అన్నదాతలకు బాసటగా ఉండాలన్నది లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా జిల్లాకు రూ.2.54 కోట్లను మంజూరు చేశారు.

**మండలానికి ఐదు కి.మీ చొప్పున**జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం కావడం, ప్రధానంగా సన్న,చిన్నకారు రైతులే అధికంగా ఉండటం, చిన్న చిన్న కమతాలు కావడంతో పొలాలకు వెళ్లేందుకు దారులు లేకుండా పోయాయి. కనీసం ఎరువు బస్తా కూడా తీసుకువెళ్లలేని పరిస్థితులు అనేక గ్రామాల్లో నెలకొన్నాయి. ఈ కారణంగా రైతుల మధ్య సమన్వయం రావడంతో అనేక చోట్ల గతంలో దారుల నిర్మాణం జరిగింది. ప్రస్తుతం మళ్లీ అవకాశం రావడం, తొలి దశలో మండలానికి 5 కి.మీ చొప్పున చేపడుతున్నారు.

**మార్చి వరకు లక్ష్యం**మంజూరైన పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనుల పురోగతిపై జిల్లా నుంచి మండల స్థాయి అధికారుల వరకు పర్యవేక్షణ చేపట్టారు.

**పరస్పర సహకారం పెరుగుతుంది** ఏటా చేపట్టే మామూలు ఉపాధి పనులు కాకుండా పొలాలకు దారులు ఏర్పాటు చేయడం శుభ పరిణామం. రైతులు కూడా చాలా చోట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందులో కూలీలు కూడా ఉండటంతో పనులు చేపట్టేందుకు ఉత్సుకత చూపుతున్నారు. పొలాలకు వేసుకునే బాటలతో రైతులు ఏళ్ల తరబడి పడుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించినట్లవుతుంది. ఉపయోగం కలుగుతుంది.– శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి.

# పట్టణాల అభివృద్ధిపై నిర్లక్ష్యం

జగిత్యాల : జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడింది. పట్టణాల సుందరీకరణ, అభివృద్ధి కోసం ఆరేళ్ల కిందట టీయూఎఫ్ఐడీసీ కింద నిధులు మంజూరయ్యాయి. సకాలంలో పూర్తిచేయకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

**రూ.75 కోట్లలో 50 శాతం మాత్రమే**

జగిత్యాల పట్టణానికి టీయూఎఫ్ఐడీసీ కింద మూడు విడతల్లో రూ.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో 50 శాతం నిధులు మాత్రమే వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. రూ.34.59 కోట్ల నిధులకు సంబోంధించిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. తొలి విడతలో రూ.2.20 కోట్లతో అంతర్గత రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. రెండో విడతలో రూ.2.39 కోట్లతో బీటీ రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం చేపట్టాలని భావించినా టెండర్ల దశ దాటలేదు. ఇందులోనే రూ.5 కోట్లతో కమ్యూనిటీ భవనాలు, గ్రేవ్‌యార్డు నిర్మించాల్సి ఉండగా వీటికి టెండర్లు సైతం నిర్వహించలేదు. ఇక మూడో విడతలో రూ.25 కోట్లకు సంబంధించి నల్లగుట్ట వద్ద డంపింగ్‌యార్డు ఆధునికీకరణ, అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు చేపట్టాల్సి ఉన్నా వాయిదా వేశారు. శాసనసభ ఎన్నికల కోడ్‌తో టెండర్లు కూడా పూర్తి చేయలేకపోయారు. ప్రభుత్వం మారడంతో టెండర్లు పూర్తి చేయలేకపోయామని పుర అధికారులు చెబుతున్నారు. 48 వార్డుల్లో అత్యధిక వార్డులు అంతర్గత రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నిధులు రాక నిలిచిన పనులు**

మెట్‌పల్లి పట్టణంలో అభివృద్ధి పనులకు టీయూఎఫ్ఐడీసీ కింద రెండు విడతల్లో రూ.50 కోట్ల నిధులు ఆరేళ్ల కిందట మంజూరయ్యాయి. మొదటి విడతలో రూ.25 కోట్లతో పనులు పూర్తి చేయగా, రెండో విడతలో మాత్రం పనులను మధ్యలోనే ఆపివేశారు. రూ.8 కోట్లతో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు, డివైడర్లు, సెంట్రల్



లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా మురుగు కాలువలు అసంపూర్తిగా వదిలేయడంతో అధ్వానంగా తయారయ్యాయి. మెట్‌పల్లి నుంచి రేగుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు, కూబ్‌సింగ్ పార్కు అభివృద్ధికి రూ.కోటి, చెరువు అభివృద్ధి, మినీట్యాంక్‌బండ్ ఏర్పాటుకు రూ.2.80 కోట్లు, గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.1.10 కోట్లు, శ్మశానవాటికల అభివృద్ధి కోసం రూ.50 లక్షలు, ప్రధాన మురుగు కాలువలు, సీసీరోడ్లకు నిధులు కేటాయించినా పనులను ప్రారంభించకుండా వదిలేశారు. రూ.50 కోట్ల నిధుల్లో 70 శాతం మాత్రమే పనులు పూర్తి చేశామని మిగతా పనులకు నిధులు రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు.

**ఏళ్లు గడిచినా అసంపూర్తిగానే!**

పట్టణ అభివృద్ధి కోసం 2019లో టీయూఎఫ్ఐడీసీ కింద రెండు విడతల్లో రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పట్టణంలో 25 రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించి జులై 1, 2019లో అప్పటి ప్రజాప్రతినిధులు పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించి అయిదున్నరేళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా వదిలేశారు. రూ.80 లక్షలతో కొత్తబస్టాండ్ నుంచి గడిబురుజు వరకు తారురోడ్డు, రూ.1.55 కోట్లతో ఐబీరోడ్ నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు తారురోడ్డు పనులు ప్రారంభించలేదు. రూ.కోటితో పట్టణంలోని నందిచౌక్, బస్టాండ్ సర్కిల్, ఐబీ గెస్ట్‌హౌజ్ వద్ద కూడళ్ల నిర్మాణాలకు నిర్ణయించి పనులు చేపట్టకుండా వదిలేశారు. రూ.35 లక్షలతో ఫుల్‌వాగులో బతుకమ్మ ఘాట్ నిర్మించేందుకు నిర్ణయించి పనులు చేపట్టలేదు. రూ.50 లక్షలతో జగ్జీవన్‌రామ్ విగ్రహం ఆవరణలోని ఫుల్‌వాగులో ఉద్యానవనం నిర్మించేందుకు పనులు ప్రారంభించినా అర్ధంతరంగా వదిలేశారు. రూ.10 లక్షలతో వేంకటేశ్వరస్వామి దేవాలయం ముందు కూడలి నిర్మించేందుకు నిర్ణయించి పనులు ప్రారంభించలేదు. రూ.8.72 కోట్లతో పట్టణంలోని 4.5 కి.మీ పొడవునా ప్రధాన రహదారి విస్తరణ, మధ్యలో అధునాతన డివైడర్లు, హైమస్ట్ లైటింగ్, ఇరువైపులా మురుగు కాలువ, పాదచారుల నడక మార్గం పనులను ప్రారంభించి 90 శాతం పూర్తిచేసి విడిచిపెట్టారు.

# సంఘాల ప్రగతికి.. కొత్త సారథులు!

చేగుంట: స్వయం సహాయక సంఘాల్లో గ్రామీణ మహిళలు చేరి ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేసుకుంటున్నారు. రుణాలు తీసుకుని పొదుపు చేస్తూనే ప్రగతి వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో సంఘాల పాత్ర కీలకం. వీటిల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ మొదలైంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఇందుకోసం చర్యలు చేపట్టారు.ఎన్నికల నిర్వహణపై మండల ఏపీఎం, సీసీలు, ఇతర సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీరు మండల, గ్రామస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించి నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

**కొత్త సభ్యులకు అవకాశం**

జిల్లాలోని సంఘాల సభ్యుల్లో కొత్త వారికి అవకాశం కల్పించనున్నారు. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశం నిర్వహించి ఏకగ్రీవం, చేతులు పైకెత్తి ఎన్నుకోవడం, కాగితాలు రాసి సభ్యురాలి ఎన్నికలకు మద్దతు తెలియజేయడం వంటి పద్ధతుల్లో ఎంపిక నిర్వహించనున్నారు. సంఘాల ద్వారా ఎన్నికైన అధ్యక్షులు గ్రామసంఘం అధ్యక్షురాలిని, గ్రామస్థాయి అధ్యక్షులందరూ కలిసి జిల్లా సమాఖ్యకు అధ్యక్షులను ఇదే పద్ధతిలో ఎన్నుకుంటారు.

మార్చి చివరి నాటికి..: మార్చి చివరిలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాచరణ రూపొందించింది. మండల స్థాయి ఎన్నికల ప్రక్రియను ఫిబ్రవరి ఆఖరు వరకు పూర్తి చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మండల స్థాయిలో ఎన్నికలపై మహిళా సంఘాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

వీరే కీలకం: తీసుకున్న రుణాలను రుణాలను కొందరు సభ్యులు చెల్లించేందుకు సుముఖంగా ఉండడంలేదు. ఇలాంటి సందర్భంలో సంఘంలోని అధ్యక్ష, ఉపాధ్యక్షులే కీలకంగా వ్యవహరించనున్నారు. గ్రామైక్య సంఘంలో స్త్రీనిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్, పొదుపు, మహిళా శక్తి రుణం, వాటర్‌షెడ్ రుణాలు వంటివి సంఘంలో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేలా వీరు చర్యలు తీసుకుంటారు. మండలాలు: 20 గ్రామాలు: 493 వీవోలు: 521 స్వయం సహాయక సంఘాలు: 13,061 సభ్యులు: 1,37,859

# చురుగ్గా వారధి నిర్మాణం

ఖానాపూర్: ఖానాపూర్, పెంబి మండలాల ప్రజలకు రోడ్డు కష్టాలు తీరనున్నాయి. ఖానాపూర్ మండలం రాజూరా నుంచి పెంబికి వెళ్లేందుకు ఖానాపూర్-సత్తనపల్లి-మందపల్లి మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఖానాపూర్ మండలం రాజూరా నుంచి పెంబి మండలం మందపల్లి మధ్య దూరం రెండు కిలోమీటర్లే. మధ్యలో పల్కేరు వాగు ఉండటంతో వర్షాకాలం వాగు పొంగితే ఈ రెండు గ్రామాల మధ్య రహదారి సౌకర్యం లేకపోవడంతో పెంబికి వెళ్లే వారు ఖానాపూర్ మీదుగా 47 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఈ రెండు గ్రామాల మధ్య పల్కేరు వాగుపై రెండుచోట్ల వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో రాజూరా చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు పెంబి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**రూ.18 కోట్లతో పనులు ప్రారంభం**



పల్కేరు వాగు వంతెన ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.18 కోట్లతో వారధి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రాజూరా తండా నుంచి వంతెన వరకు విశాలంగా మొరం రోడ్డును సిద్ధం చేశారు. అవతలివైపు మందపల్లి వరకు మొరం దారి పనులు పూర్తయ్యాయి. చందునాయక్‌తండా మధ్యలో 8 పిల్లర్లతో ఓ వంతెన నిర్మాణం చేపడుతుండగా, మందపల్లి వైపు మరో వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మందపల్లి నుంచి చందునాయక్ తండా వరకు అయిదున్నర మీటర్ల వెడల్పుతో 5.2 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. పెంబి నుంచి నేరుగా నిర్మల్‌కు బస్సులు

వాగుపై వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంపై పెంబి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెంబి వాసులు జిల్లా కేంద్రం నిర్మల్‌కు వెళ్లాలంటే (22 కి.మీ.) ఖానాపూర్ లేదా తర్లపాడు మీదుగా వచ్చి నిర్మల్‌కు (35 కి.మీ). వెళుతున్నారు. ఈ లెక్కన నిర్మల్‌కు 57 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. వంతెనల పనులు పూర్తయిన పక్షంలో పెంబి-మందపల్లి-రాజూరా-సింగాపూర్-దిమ్మదుర్తి మీదుగా నేరుగా నిర్మల్‌కు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. పెంబి నుంచి వయా రాజూరా మీదుగా ఆర్టీసీ బస్సులు నడిపే అవకాశం ఉండటంతో రాజూరా, బావాపూర్-ఆర్, తండాల ప్రజలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో పాటు ఈ ప్రాంతం రవాణా, వ్యాపారపరంగా వృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి.

# అర కి.మీ.. అష్టకష్టాలు

జైపూర్ : జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామ శివారులోని ఈదులవాగు మీద నిర్మిస్తున్న వంతెన నిర్మాణానికి బిల్లులు రాకపోవడంతో 'ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి' అన్న చందంగా పనులు సాగుతున్నాయి. అయితే వంతెన పనులు పూర్తయ్యాయి. కానీ అర కిలోమీటరు మేర తారు రహదారి నిర్మించకపోవడంతో ఆ మార్గంలో వెళ్లే 12 గ్రామాల ప్రజలు నిత్యం దుమ్ములోనే ప్రయాణించాల్సి వస్తోంది. ప్రసుత్తం ఉన్న కంకర రహదారిపై ప్రయాణానికి అష్టకష్టాలు పడుతున్నారు.

**రూ.3 కోట్లతో పనులు**

జైపూర్-పెగడపల్లి గ్రామాల మధ్యలో ఈదులపల్లి వాగు ఉంటుంది. ఏటా వానాకాలంలో ఎగువన కురిసిన వర్షాలతో వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. సమీపంలో ఉన్న టేకుమట్ల వాగు ఉప్పొంగడంతో ఈ రెండు వాగుల మధ్యలో ఉన్న సుమారు 12 గ్రామాల ప్రజలతో పాటు ఎస్టీపీపీలో విధులు నిర్వర్తించే కార్మికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతుంటారు. గతేడాది మార్చి 15న అప్పటి మంత్రి హరీష్‌రావు వంతెనను అనుసంధానిస్తూ బీటీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్ల నిధులతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇటీవలే వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ బిల్లులు రాకపోవడంతో రహదారి పనులు ముందుకు సాగడం లేదు. అర



కిలోమీటరు మేర కంకర తేలి ఉన్న రహదారిపై ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. గుంతలు పడి ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ మార్గంలో ముందు భారీ వాహనాలు వెళ్తే వెనుక వచ్చే చోదకుల కళ్లలో దుమ్ము పడుతోంది. ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే భయ పడుతున్నారు.

**ప్రమాదాల బారిన పడుతున్నారు**

వంతెనకు సంబంధించిన బీటి రహదారి నిర్మాణం జరగకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న కంకర రోడ్డుపై నీటిని చల్లకపోవడంతో దుమ్ము లేచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ మార్గం ద్వారానే ఎస్టీపీపీలో పనిచేసే చాలా ఒప్పంద కార్మికులు ప్రయాణం చేస్తుంటారు. గతంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. దుస్స భాస్కర్, పెగడపల్లి

**త్వరగా పూర్తి చేయిస్తాం**

గుత్తేదారుకు నిర్మాణానికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో రోడ్డు నిర్మాణం జరగడం లేదు. గుత్తేదారుతో మాట్లాడి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. భరత్, ఏఈ ఆర్అండ్‌బీ

# నగరానికి నకిలీ మందులు



సిరిసిల్ల :సరిహద్దులు దాటి నగరానికి నకిలీ ఔషధాలు తరలివస్తున్నాయి. కొన్ని ముఠాలు గుట్టుగా ఔషధ దుకాణాలతో సంబంధాలు పెట్టుకొని నకిలీ మందులు తెచ్చి విక్రయిస్తున్నారు. ఔషధ నియంత్రణ శాఖ ఇటీవల 8 కేసులు నమోదు చేసి పోలీసుల సహకారంతో కొందరిని అరెస్టు చేసింది. ముఖ్యంగా క్యాన్సర్ ఇతర క్లిష్టమైన రోగాలకు సంబంధించి ఖరీదైన మందులకు పోలిన మందులను తెస్తున్నారు. కవర్‌పై పేరులో అక్షరాలను అటు ఇటు చేయడం.. ప్యాకింగ్‌లో తేడా కన్పించకపోయేసరికి రోగులు గుర్తుపట్టడం లేదు. నాలుగైదు స్ట్రిప్పులు గోలీలు లేదా ఇంజక్షన్ల ప్యాకెట్లు కొనేటప్పుడు వాటిలో ఒకటి, రెండు నకిలీవి కలిపి అంటగడుతున్నారు. నకిలీ మందుల కారణంగా రోగం నయం కాకపోగా సమస్య మరింత పెరుగుతోంది. ఔషధాల విషయంలో ఎంతోకొంత పరిజ్ఞానం ఉంటే తప్ప వీటిని గుర్తించడం కష్టం. గోలీల్లో ఔషధానికి బదులు సుద్ద పిండి, ఇతర పదార్థాలు పెట్టి ప్యాక్ చేస్తున్నారు. గుజరాత్, పుణేలాంటి చోట్ల వీటిని తయారు చేసి దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. శివార్లు, బస్తీల్లోని కొన్ని మెడికల్ షాపులను ఎంచుకొని ఈ ముఠాలు అక్రమ దందా కొనసాగిస్తున్నాయి. దుకాణదారులకు భారీఎత్తున కమీషన్లు ఇస్తుండటంతో ఈ వ్యాపారంలో దిగుతున్నారు.సరైన అవగాహన లేనివారికి వీటిని అంటగడుతున్నారు.

**తస్మాత్ జాగ్రత్త.. గుర్తిస్తే ఫిర్యాదు చేయండి**

ఈ తరహా అక్రమాలపై ఔషధ నియంత్రణ శాఖ కొరడా ఝుళిపిస్తోంది. ఇప్పటి వరకు 500 వరకు కేసులు నమోదు చేసింది. నకిలీ మందులతోపాటు, మత్తు మందుల విక్రయాలు, లైసెన్సు లేకుండా మందుల విక్రయాలు, నాణ్యత లేని వాటిని అమ్మడం, అధిక ధరలు వంటి మోసాలపై ఈ కేసులు నమోదయ్యాయి. నగరంలో వందల సంఖ్యలో పెద్ద, చిన్న, నర్సింగ్‌హోంలు వాటికి అనుసంధానంగా మందుల దుకాణాలు ఉన్నాయి. అన్నింటిలో తనిఖీలు చేయడం అధికారులకూ కష్టమే. ఈ నేపథ్యంలో పౌరులే ముందుకొచ్చి మోసాలపై సమాచారం ఇవ్వాలని డీసీఏ అధికారులు కోరుతున్నారు. ఔషధాలు కొన్న తర్వాత వైద్యులకు మరోసారి చూపించాలని సూచిస్తున్నారు. బ్రాండ్ పేరు, తయారీ తేదీ, చిరునామాలాంటివి అన్ని ప్యాకెట్లపై ఒకేలా ఉన్నాయా.. లేదా పరిశీలించి అనుమానం వస్తే డీసీఏ అధికారులను సంప్రదించాలన్నారు. దుకాణాలకు అనుమతులు లేకున్నా.. నకిలీ ఔషధాలను గుర్తించినా.. అక్రమ నర్సింగ్ హోంలు నడుపుతున్నా.. డీసీఏ టోల్‌ఫ్రీ 1800-599-6969 ద్వారా తమ దృష్టికి తేవాలని డైరెక్టర్ జనరల్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గుట్టుగా ఉంచుతామన్నారు.

# రుణ మంజూరు లక్ష్యం చేరేనా?




సిరిసిల్ల : ప్రభుత్వం మహిళల ఆర్థిక అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అడుగులేస్తోంది. ఆ దిశగా స్వశక్తి సంఘాలకు ఇచ్చే బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం మార్చి నాటికి వందశాతం చేరుకోవాలి. ఇంత వరకు బాగానే ఉన్నా.. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారిపై పనిభారం పెరుగుతోంది. మెప్మాలో అంతర్గత కార్యకలాపాల నిర్వహణ... ఈ ఆర్థిక సంవత్సరం రుణ లక్ష్యాల ప్రగతిపై కథనం.

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ పురపాలికల పరిధిలో 2,983 సంఘాలు.. 31,488 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సిరిసిల్లలో 202 సంఘాలు, వేములవాడలో 138 సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకున్నారు. సిరిసిల్లలో 67శాతం, వేములవాడలో 55శాతం మేరకు లక్ష్యాలు చేరుకున్నాయి. మార్చినాటికి వందశాతం లక్ష్యం సాధించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆరు నెలల పాటు పొదుపు పాటిస్తున్న వారికి రుణాల మంజూరులో ప్రాధాన్యం ఇవ్వాలి. తొలి ఏడాది రూ.75వేలు, ఆ తర్వాత రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. మహిళా సంఘాల్లో వ్యక్తిగత వ్యాపారాలు చేసుకోవడానికి సమష్టిగా పెద్ద సంస్థలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి ఈ బ్యాంకు లింకేజీ ద్వారా వీలుంటుంది. కొత్తగా వ్యాపారం ప్రారంభించుకోవడానికి పాత వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి సైతం ఆర్థిక సహకారం అందిస్తున్నారు. రుణాలు తీసుకోవాలనుకునే స్వశక్తి సంఘాలపై పర్యవేక్షణ ఉండాల్సి ఉండగా సిబ్బంది లేమి కారణంగా లక్ష్యాలపై ప్రభావం చూపుతోంది.

**మంజూరుకాని పోస్టు**

జిల్లా ఆవిర్భావం తర్వాత పీడీ పోస్టు మంజూరుకాలేదు. జూన్ వరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమి ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. అదనపు కలెక్టర్ బదిలీ తర్వాత మెప్మా కార్యకలాపాలను కలెక్టర్ చూస్తున్నారు. ఏవో ఇన్‌ఛార్జిగా సిరిసిల్ల కమిషనర్‌కు అప్పగించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాత ఉమ్మడి జిల్లాలకు మాత్రమే పీడీలు ఉన్నారు. కొత్త జిల్లాలో ఆయా జిల్లా కేంద్రంలోని పురపాలికల కమిషనర్లకు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ఇన్‌ఛార్జులుగా ఉంటున్నారు. సిరిసిల్ల పురపాలికలో రెండేళ్ల క్రితం డీఎంసీ, రెండు నెలలక్రితం టీఎంసీలు మృతిచెందడంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ రెండు బాధ్యతలను సీవో చూసుకుంటున్నారు. వేములవాడలో మెప్మా సిబ్బంది నియామకమే లేదు. సిరిసిల్ల ఏడీఎంసీకి వేములవాడ డీఎంసీ బాధ్యతలు అప్పగించారు. సంఘాల్లోని సీనియర్ ఆర్పీలను కార్యాలయంలో పనులకు రప్పిస్తున్నారు. గుర్తింపులేకుండా అదనపు బాధ్యతలు అప్పగించడంపై వారు నిరాసక్తితో ఉన్నారు. పీడీపోస్టు భర్తీ చేస్తే చాలా వరకు సమస్యలకు పరిష్కారం లభించనుంది.

# యంత్ర సామర్థ్యం పెంపుతోనే ఉత్పత్తి మెరుగు



కొత్తగూడెం : సింగరేణి యాజమాన్యం మానవ వనరులకు ప్రత్యామ్నాయంగా యాంత్రీకరణకు ప్రాధాన్యమిస్తోంది. ఇదే క్రమంలో యంత్రాలను పూర్తిస్థాయి పనిగంటలు వినియోగించే అంశంపై కొద్ది నెలలుగా ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. కానీ, ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంపై యాజమాన్యం మల్లగుల్లాలు పడుతోంది.ప్రస్తుతం సింగరేణి ఉపరితల, భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి 828 యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఒక్కో యంత్రాన్ని రోజుకు సగటున 18 గంటలు వినియోగించే అవకాశముంది. కానీ, ప్రస్తుతం 7 గంటల 24 నిమిషాలు మాత్రమే వినియోగిస్తున్నారని సంస్థ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఒకవేళ ఉపరితల గనుల్లోని యంత్రాల పనిగంటలు పూర్తి సామర్థ్యం మేర పెరిగితే.. అదనంగా 20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర బొగ్గు ఉత్పత్తి పెరిగే అవకాశముందని యాజమాన్యం పేర్కొంటోంది. తాజాగా నిర్వహించిన మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాల్లోనూ ఈ విషయంపై ఏరియాల కమిటీలు పలు సూచనలు చేశాయి. షావెళ్ల పనితీరు కాస్త ఫర్వాలేదనిపించినా.. డంపర్లు రోజుకు 18 గంటల 30 నిమిషాలకు బదులు సగం సమయమూ పనిచేయడం లేదు. అవి రోజుకు 8 గంటల 24 నిమిషాలే ఉత్పత్తిని కొనసాగిస్తున్నాయి. డ్రిల్ యంత్రాలదీ ఇదే వరుస. ఇవి సుమారు రోజులో 14 గంటల పాటు నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. ఉపరితల గనుల్లో వినియోగిస్తున్న భారీ యంత్రాలను రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేశాం. ఆరేళ్ల వ్యవధికి యంత్రాల విడిభాగాలను కాస్ట్ క్యాప్ పద్ధతి ద్వారా కొనుగోలు చేస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించకుంటే నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. కనీసం మరో నాలుగు గంటల పాటు వాటితో అదనంగా ఉపయోగించుకునేలా కార్మికోద్యోగులను సమాయత్తం చేస్తున్నాం.ఎన్.బలరాం, సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

# మార్పు వైపు.. యువత అడుగులు

మిర్యాలగూడ : చెడు అలవాట్లు, ప్రణాళిక లేని ఆహార, నిద్ర సమయాలతో నేటి యువత అనేక అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక మంది యువత 35 ఏళ్ల లోపే మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, క్యాన్సర్ వంటి వ్యాధులకు గురవుతున్నారు. కిడ్నీ, కాలేయ సంబంధిత సమస్యలతో పాటు ఊబకాయం వంటి వాటిని ఎదుర్కొంటున్నారు. వీటి బారి నుంచి కాపాడుకునేందుకు యువత ఇటీవల వ్యాయామంతో పాటు ప్రత్యేక ఆహార అలవాట్ల కోసం నిపుణులను సంప్రదిస్తున్నారు.

**ఏడు లక్షలకు పైగా యువత..**

ఉమ్మడి జిల్లాలో సుమారు ఏడు లక్షలకు పైగా యువత ఉన్నారు. వీరిలో సుమారు 20 శాతం మందికి పైగా వివిధ వ్యాధులు, ఊబకాయం, అధిక బరువుతో బాధ పడుతున్నారు. పుట్టుకతో వచ్చే మధుమేహ



వ్యాధిగ్రస్థులను మినహాయిస్తే.. వయసుకు తగిన బరువు కంటే ఎక్కువ ఉన్న వారు సుమారు 40 శాతం మంది ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.పలు వ్యాధుల నియంత్రణతో పాటు ఊబకాయం, అధిక బరువును తగ్గించుకునేందుకు ఆహార ప్రణాళిక, వ్యాయామం చేయడం ముఖ్యమే. కరోనా అనంతరం అనేక మందిలో వ్యాయామంపై అవగాహన పెరిగింది.

వైద్యులు సైతం నిత్యం కనీసం గంట పాటు వ్యాయామం చేయాలని సూచిస్తున్నారు. దీంతో అన్ని పట్టణాల్లో ప్రభుత్వ వ్యాయామశాలలతో పాటు ప్రైవేట్ ఆధ్వర్యంలో అధునాతన వ్యాయామశాలలు వెలవడంతో పాటు ప్రత్యేక శిక్షకులు సైతం అందుబాటులో ఉన్నారు.

**శరీరతత్వాన్ని బట్టి ప్రత్యేక డైట్‌లు**

యువత శరీరతత్వాన్ని వారి ఆరోగ్య సమస్యల ఆధారంగా ప్రత్యేక డైట్‌లు సిఫారసు చేస్తున్నారు. వీటిలో ప్రధానమైనవి కీటో, ఇంటర్ మిటెంట్ ఫాస్టింగ్, ఓ మ్యాడ్ వంటి పద్ధతులున్నాయి.

కీటో పద్ధతిలో పిండి పదార్థాలు పూర్తిగా తగ్గించి.. కేవలం అధిక కొవ్వు, అధిక ప్రొటీన్‌లు ఉన్న ఆహారాన్ని సిఫారసు చేస్తారు. ఇది అంత ఆరోగ్యకరమైంది కాదని నిపుణులు చెబుతున్నారు.

ఓ మ్యాడ్ విధానంలో 23 గంటల పాటు ఉపవాసం ఉండి ఒక గంటలో ఆ రోజుకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందిస్తారు. ఇటీవల అత్యధిక మంది ఆచరిస్తున్న వాటిలో ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ ముఖ్యమైనది. దీంట్లో 16 గంటలు ఉపవాసం ఉండి.. 8 గంటలు ఆహారం తినడం, 12 గంటలు ఉపవాసం, 12 గంటలు భోజనం, వారంలో ఒకటి లేదా రెండు రోజుల ఉపవాసం వంటి మూడు రకాల పద్ధతులున్నాయి.

**కరోనా అనంతరం మార్పు**

తిరుపతి, వ్యాయామ శిక్షకుడు, మిర్యాలగూడ

వ్యాయామంపై కరోనా అనంతరం యువతలో చాలా మార్పు వచ్చింది. అనేక మంది యువత ఒక నెల క్రమం తప్పకుండా వ్యాయామం చేసి.. ఆ తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారు. అనేక మంది తమ వయసుకు మించి బరువుతో బాధ పడుతున్నారు. వీరికి ప్రత్యేక వ్యాయామాలతో పాటు ఆహారాన్ని సిఫారసు చేస్తున్నారు. ప్రస్తుతం జిమ్‌లో నిత్యం వంద మందికి పైగా యువత శిక్షణ పొందుతున్నారు.

**రోగిని బట్టి ఆహార పద్ధతులు**

జాహ్నవి, న్యూట్రిషనిస్టు, మిర్యాలగూడ

ప్రస్తుతం అనేక మంది యువత మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లతో పాటు క్రమపద్ధతి లేని ఆహారపు అలవాట్లతో పలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో వారి వ్యాధులు, శరీరతత్వాన్ని బట్టి ఆహార పద్ధతులు సూచిస్తున్నాం. ఎటువంటి వ్యాధులు లేకుండా ఊబకాయం, అధిక బరువు ఉన్న వారికి ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ విధానం బాగా పని చేస్తుంది.

# గ్రామాల్లో వడివడిగా.. పట్టణాల్లో మందకొడిగా

నల్గొండ : సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో చివరి దశకు చేరింది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. దాదాపు 22 రోజుల నుంచి సర్వే కొనసాగిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన మండలాలు, పురపాలికల్లో ఆన్‌లైన్ వివరాల నమోదు చేపట్టారు. నమోదు ప్రక్రియ కొన్ని మండలాల్లో చివరి దశకు చేరింది. దీనిని త్వరితగతిన పూర్తి చేయించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. మండల, పురపాలిక కార్యాలయాల్లో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వివరాలు కంప్యూటరీకరిస్తున్నారు.

**పూర్తి కాని సర్వే**

జిల్లాలో దేవరకొండ, శాలిగౌరారం మండలాల్లో.. నల్గొండ, దేవరకొండ పురపాలికల్లో ఇంకా సర్వే పూర్తి కాలేదు. సర్వే పూర్తి అయిన మండలాలు, పురపాలికల్లో వివరాలు నమోదు ప్రక్రియ చురుకుగా కొనసాగుతోంది. జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో కలిపి 5,09,562 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. సర్వే పూర్తయ్యే సమయానికి ఆ కుటుంబాల సంఖ్య పెరగడం విశేషం. 5,10,752 కుటుంబాల వివరాలు నమోదు దీనినే సూచిస్తున్నాయి. ఇందులో ఇప్పటికే 4,36,713 కుటుంబాలకు సంబంధించిన ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3,88,489, పట్టణ ప్రాంతాల్లో 48,224 కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. ఎంపీడీవో, తహసీల్దార్, పురపాలిక కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

**మొదట్లో జాప్యం.. తర్వాత వేగవంతం**

సమగ్ర సర్వే ప్రక్రియకు మొదట ఎక్కువ సమయం పట్టింది. ముందస్తు శిక్షణ తీసుకున్నప్పటికీ ఎన్యుమరేటర్లు తొలి రెండు, మూడు రోజులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ తర్వాత వేగం పెంచారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చకచకా ముందుకు సాగింది. పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికి కొందరు వివరాలు నమోదు చేయించుకోకపోవడం గమనార్హం. ఆన్‌లైన్ ప్రక్రియలో ఆపరేటర్లు సందేహం వస్తే నివృత్తి చేసుకుంటూ నమోదు చేస్తున్నారు. ఆయా కుటుంబాల్లో ఇద్దరు ముగ్గురు సభ్యులుంటే వివరాల నమోదుకు 15 నిమిషాలు, అయిదుగురుంటే 20 నిమిషాలు.. ఏడుగురు అంతకంటే ఎక్కువ ఉంటే అరగంట వరకు సమయం పడుతోందని ఆపరేటర్లు పేర్కొంటున్నారు. ఒక కుటుంబ వివరాలు నమోదుకు రూ.30 చొప్పున చెల్లిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నా.. అధికంగా ఇవ్వాలని ఆపరేటర్లు కోరుతున్నారు.




# డ్రైవర్ల కుమార్తెల వివాహానికి రూ.లక్ష.. వారికి ఉచిత ప్రయాణం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికలకు సంబంధించి మేనిఫెస్టోను ప్రకటించింది. విద్యార్థులు, మహిళల ప్రయోజనాలే లక్ష్యంగా ఆప్ హామీల వర్షం కురిపించింది. పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దీనిని విడుదల చేశారు. ఉద్యోగాల కల్పన, మహిళా సమ్మాన్ యోజన, సంజీవని పథకం సహా తదితర హామీలు ఇందులో ఉన్నాయి.

వృద్ధులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పతుల్లో ఉచిత వైద్యం, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాలను కల్పిస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. వీటితో పాటు పలు సంక్షేమ పథకాలను కొనసాగిస్తామన్నారు. మొత్తం 15 గ్యారెంటీలతో మేనిఫెస్టోను విడుదల చేశారు. ఐదేళ్లలో ఇచ్చిన అన్ని హామీలను అమలుచేస్తామని అన్నారు.

**ఆప్ గ్యారెంటీలు ఇవీ..** నిరుద్యోగులు లేని రాజధానిగా దిల్లీని మార్చడమే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉద్యోగాల కల్పన. మహిళా సమ్మాన్ యోజన పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.2,100. సంజీవని పథకం కింద.. 60 ఏళు నిండిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులోనూ ఉచిత వైద్యం, నీటి సరఫరా బిల్లులు మాఫీ. 24 గంటల నీటి సరఫరా, యూరప్‌లో మాదిరిగా రోడ్ల నిర్మాణం, యమునా నది శుభ్రం చేయడం. డా.అంబేద్కర్ స్కాలర్‌షిప్ స్కీమ్, విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు దిల్లీ మెట్రో ప్రయాణంలో 50 శాతం రాయితీ. పూజారులు, గ్రంథీలు ఒక్కొక్కరికి రూ.18 వేలు, కౌలుదారులకు ఉచిత కరెంటుతో పాటు ఉచిత నీటి సౌకర్యం, మురుగు నీటి వ్యవస్థను పరిష్కరించడం, రేషన్ కార్డులు మంజూరుచేయడం. ఆటో, టాక్సీ, ఈ-రిక్షా డ్రైవర్ల కుమార్తెల వివాహాలకు రూ.లక్ష అందజేత, వారి పిల్లలకు ఉచిత కోచింగ్, జీవిత బీమా. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ)లకు ప్రైవేటు గార్డులను ఆప్ అందించనుంది.



# ₹10 లక్షల కోట్లు ఉఫ్!

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. బలహీన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం, అమెరికా వాణిజ్య విధానంపై అనిశ్చితి వంటి కారణాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 900 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 23 వేల పాయింట్ల దిగువకు చేరింది. దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఓ దశలో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 3 శాతం, బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ 4 శాతం చొప్పున కుంగాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.10 లక్షల కోట్ల మేర ఆవిరై.. రూ.410 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,700.43 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,190.46) నష్టాల్లో ప్రారంభమైంది. అదే నష్టాల పరంపర రోజంతా కొనసాగింది. ఇంట్రాడేలో 75,267.59 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 824.29 పాయింట్ల నష్టంతో 75,366 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 263.05 పాయింట్లు కోల్పోయి 22,829.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు బలహీనపడి 86.33 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్, జొమాటో, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ షేర్లు నష్టాల్లో ముగియగా.. ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 78.74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2769 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**కారణాలు ఇవే..** అమెరికాలోని అక్రమ వలసదారులకు తిప్పి పంపే విషయంలో తొలుత కొలంబియా వ్యతిరేకించడం, దానికి ప్రతిగా 25 శాతం సుంకం విధిస్తామని ట్రంప్ బెదిరించడం, దాంతో కొలంబియా తన నిర్ణయాన్ని మార్చుకోవడం వంటి పరిణామాలు జరిగాయి. దేశాలను దారికి తెచ్చుకునే విషయంలో ట్రంప్ ఇలా బెదిరింపులకు దిగుతుండడంతో ఎప్పుడు ఏ దేశంపై ఉరుముతారోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. ఇప్పటికే ఇలాంటి హెచ్చరికలు కెనడా, మెక్సికోకు ఆయన జారీ చేసిన విషయం తెలిసిందే. త్రైమాసిక ఫలితాల సీజన్‌లో వెలువడుతున్న కార్పొరేట్ ఫలితాలు ఏమాత్రం ఆశాజనకంగా లేకపోవడంతో మదుపర్లు నిరాశగా ఉన్నారు. దీనికి తోడు ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై కూడా మదుపర్లకు పెద్దగా ఆశల్లేకపోవడం మార్కెట్లలో నిరాసక్తతకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బుధవారం వడ్డీ రేట్ల కోతపై నిర్ణయం వెలువరించనుంది. ఈ సారి ఎలాంటి కోతా ఉండకపోవచ్చన్న అంచనాలు ఉన్నాయి. అయితే, మున్ముందు ఎలా వ్యవహరిస్తారనే విషయంలో ఫెడ్ నుంచి ఎలాంటి కామెంట్లు వెలువడతాయనే దానిపై మార్కెట్లు చలించే అవకాశం ఉందని అనలిస్టులు చెబుతున్నారు. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. గత ట్రేడింగ్ సెషన్ నాటికి (జనవరి 24) సుమారు రూ.64 వేల కోట్ల ఈక్విటీలను వారు విక్రయించడం గమనార్హం. సమీప భవిష్యత్‌లో ఈ మొత్తాలు తగ్గుతాయని గానీ, మళ్లీ కొనుగోళ్లకు దిగుతారన్న అంచనాలు గానీ లేకపోవడం మార్కెట్లో ఈ పరిస్థితికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నాటి కన్నీటి గాథలు.. ఇచ్చిన ప్రతి హామీ గుర్తున్నాయ్: నారా లోకేశ్



అమరావతి: యువగళం పాదయాత్ర తనకు జీవితకాలం గుర్తుండిపోయే అరుదైన జ్ఞాపకమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "నియంతృత్వాన్ని, నిర్బంధాలను దాటుకొని రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాలు, 97 నియోజకవర్గాలు, 2,097 గ్రామాలు మీదుగా 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్లు సాగిన చరిత్రాత్మక యువగళం పాదయాత్ర మొదలై నేటికి రెండేళ్లు. నాటి పాలకులు దీన్ని ఆపేందుకు చేయని ప్రయత్నం లేదు. మైక్ వెహికల్ సీజ్ చేయడం నుంచి యువగళం వాలంటీర్లను అరెస్టు చేయడం వరకూ అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టారు. నాటి పాలకులు ఎన్ని అడ్డంకులు పెట్టినా ప్రజలు చూపించిన ప్రేమ నన్ను మరింత దృఢంగా మార్చింది. పాదయాత్ర ప్రతి అడుగులో ప్రజల కష్టాలు చూశాను, ఆరోజు చూసిన కన్నీటి గాథలు నేటికీ గుర్తున్నాయి. ఇచ్చిన ప్రతి హామీ గుర్తుంది. ప్రజల ఆకాంక్షకు తగ్గట్టుగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది. హామీలు అన్ని క్రమపద్ధతిలో అమలు చేస్తున్నాం. యువగళం పాదయాత్రలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగమైన ప్రతి ఒక్కరికీ, నన్ను ఆదరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు" అని లోకేశ్ పోస్టు పెట్టారు.

**యువగళం.. రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసింది: మంత్రి నారాయణ...** అరాచక పాలన అంతానికి లోకేశ్ పాదయాత్ర నాంది పలికిందని మంత్రి నారాయణ అన్నారు. యువగళం పాదయాత్రతో రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేశారన్నారు.

**తెదేపా కేంద్ర కార్యాలయంలో వేడుకలు...** యువగళానికి రెండేళు పూర్తయిన సందర్భంగా తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. లోకేశ్ పాదయాత్ర ప్రజలకు ఒక భరోసా కల్పించిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టునే పనిలోనే లోకేశ్ ఉన్నారని ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి అన్నారు. కార్యకర్తలకు తానున్నానని భరోసా ఇస్తున్నారని చెప్పారు. లోకేశ్ పాదయాత్రతో వైకాపా నేతలకు వణుకు పుట్టిందని నాదెండ్ల బ్రహ్మం అన్నారు.



# ట్రంప్ ఎఫెక్ట్ గురుద్వారాల్లోనూ తనిఖీలు..!

చెప్పినట్టుగానే అక్రమ వలసదారులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో ఆయన అనుసరిస్తోన్న విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అక్రమ వలసదారుల్ని గుర్తించే క్రమంలో గురుద్వారాలనూ వదలడం లేదు. హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి చెందిన అధికారులు న్యూయార్క్, న్యూజెర్సీల్లోని ఈ ప్రార్థనా మందిరాల్లోనూ తనిఖీలు చేయడంపై సిక్కు సంస్థలు మండిపడుతున్నాయి. గురుద్వారాల పవిత్రతకు ఈ చర్య ముప్పుగా పరిణమించిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వేర్పాటువాదులు, అధికారిక పత్రాలు లేని వలసదారులు వీటిని ఉపయోగించుకోవచ్చంటూ అమెరికా స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. "ట్రంప్ యంత్రాంగం ఇప్పటివరకూ వందలమంది అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. వీరంతా ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, లైంగిక నేరాలు వంటి కేసుల్లో నిందితులుగా ఉన్నవారే. ఇక, అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. సైనిక విమానాల్లో వందల మంది అక్రమ వలసదారులను దేశం నుంచి బయటకు పంపించేశాం. ఎన్నికల్లో ట్రంప్ తాను ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారు" అని ఇదివరకు వైట్‌హౌస్ వెల్లడించింది. మరోవైపు, అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఎందుకంటే అది పలురకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని ఇప్పటికే భారత్ స్పష్టం చేసింది.

అయితే, వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికా/ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చే వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. సంబంధిత డాక్యుమెంట్లను తమతో పంచుకుంటే వాటిని పరిశీలించి స్వదేశానికి తీసుకువస్తామని పేర్కొంది.

# ఎవరినీ వదిలిపెట్టం.. మంత్రి లోకేష్ సంచలన వ్యాఖ్యలు..



విశాఖ: మంత్రి నారా లోకేష్ విశాఖలో కోర్టుకు వెళ్లారు. 'సాక్షి' పరువు నష్టం కేసులో విచారణకు హాజరయ్యారు. మూడోసారి క్రాస్ ఎగ్జామినేషన్‌కు ఆయన హాజరయ్యారు. కాగా సాక్షి తరఫున న్యాయవాది కోర్టుకు హాజరుకాకపోవడంతో తదుపరి విచారణను న్యాయస్థానం ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. 2019లో బ్లూ మీడియా పత్రిక సాక్షి తనపై ఒక కథనం రాసిందని.. తాను గతంలో మంత్రిగా ఉన్న సమయంలో విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు టీడీపీ ప్రభుత్వం తన కోసం సుమారు రూ. 25 లక్షలు ఖర్చు చేసిందని వార్త రాసిందని.. దీనికి సంబంధించి అప్పుడు తాను ఆధారాలు చూపించాలంటూ సాక్షిపై లీగల్ నోటీసు జారీ చేశానని లోకేష్ తెలిపారు.

**ఆధారాలు లేకుండా సాక్షిలో కథనం..** ఆధారాలు లేకుండా సాక్షిలో కథనం రాశారని, దీనిపై ఎన్ని సంవత్సరాలైనా న్యాయపోరాటం చేస్తానని, ఎన్నిసార్లు కేసు వాయిదా పడినా.. కోర్టుకు వస్తానని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. జగన్‌పై తల్లి, చెల్లికే నమ్మకం లేదు.. ఇక నాయకులకేం ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వ అవినీతి కేసులపై వెంటనే విచారణ జరపడం కుదరదని, ఒక్కొక్కటిగా అన్నీ చేస్తామని, వేచి చూడాలని అన్నారు. తప్పు చేసినవారిని ఎవరినీ వదిలిపెట్టమని స్పష్టం చేశారు.

**దావోస్ పర్యటనపై దుష్ప్రచారం..** దావోస్ పర్యటనపై దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి లోకేష్ మండిపడ్డారు. సుస్థిర పాలన వల్లే మహారాష్ట్రకు ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని, వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రకటనతో ఏపీ ప్రజలు చాలా నష్టపోయారని అన్నారు. జగన్ హయాంలో కంపెనీలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అమర్‌రాజా బ్యాటరీ కంపెనీని గత ప్రభుత్వం వేధించిందని.. అందువల్లే ఆ కంపెనీ చెన్నైకు తరలిపోయిందన్నారు. అనంతపురం జిల్లాలో ఏర్పాటైన కియా కంపెనీ ఎవరు తీసుకొచ్చారో అందరికీ తెలుసునని, కియా, టీసీఎస్ క్రెడిట్‌ను వైఎస్ఆర్‌సీపీ వాళ్ల అకౌంట్‌లో వేసుకుందామని చూశారన్నారు. పారిశ్రామికవేత్తలను వేధిస్తే పెట్టుబడులకు ఎవరొస్తారని మంత్రి లోకేష్ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగనివ్వమని చెప్పామని, అధికారంలోకి వచ్చాక చేసి చూపించామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చామని లోకేష్ చెప్పారు.

**డిప్యూటీ సీఎం పదవిపై స్పందన..** డిప్యూటీ సీఎం పదవిపై వచ్చిన వార్తలపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. తనకు పదవులు ముఖ్యంకాదని, తాను కార్యకర్తగానే పనిచేస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబు ఏ బాధ్యత ఇచ్చినా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఒక పదవిలో మూడు పర్యాయాలకు మించి ఉండకూడదని అన్నారు. పార్టీలో అందరికీ అన్ని అవకాశాలు రావాలనేది తన అభిప్రాయమని అన్నారు. మూడు పర్యాయాలుగా ప్రధాన కార్యదర్శిగా ఉన్నానని.. ఈసారి ఆ పదవిలో ఉండకూడదనుకుంటున్నానని మంత్రి లోకేష్ వెల్లడించారు.

కాగా రాష్ట్ర ఐటీ, మానవవనరుల అభివృద్ధిశాఖామంత్రి నారా లోకేష్ ఆదివారం రాత్రి విశాఖ నగరానికి చేరుకున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు రాత్రి చేరుకున్న లోకేశ్‌కు మంత్రి కొండపల్లిశ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ గణబాబు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, సుందరపు విజయకుమార్, లోకం మాధవి, విశాఖ పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, కార్పొరేషన్ ఛైర్మన్లు పీలా గోవింద్, బత్తుల తాతయ్యబాబుతోపాటు నేతలు బుద్ధా నాగజగదీష్, మహ్మద్ నజీర్, పెల ప్రసాద్, చింతకాయల విజయ్, గంటా రవితేజ, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి నగరంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న మంత్రికి భీమిలి, విశాఖ తూర్పు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. గత ఏడాది మైదాన ప్రాంతం నుంచి ఎక్కువమందిని ఏజెన్సీకి బదిలీ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ తమను తిరిగి మైదానానికి బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## జగన్ బెయిల్ రద్దు, కేసుల బదిలీ అంశం.. రఘురామ పిటిషన్లపై సుప్రీంలో విచారణ

దిల్లీ: వైకాపా అధ్యక్షుడు జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ మరో ధర్మాసనానికి బదిలీ, ఆయన బెయిల్ రద్దు చేయాలన్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర మిశ్రా ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ అవసరం లేదని పేర్కొంది. హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని రఘురామ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేయగా.. ధర్మాసనం అంగీకరించింది. మరోవైపు ట్రయల్ వేగంగా సాగాలని, మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్న పిటిషన్‌పై ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు జగన్ అక్రమాస్తుల కేసు పర్యవేక్షిస్తోందని.. గతంలో ఎమ్మెల్యే, ఎంపీల కేసుల విషయంలో రోజువారీ విచారణ చేపట్టాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ కేసుకూ వర్తిస్తుందని పేర్కొంది. ట్రయల్ కోర్టు.. రోజువారీ విచారణకు తీసుకోవాలని, హైకోర్టు కూడా పర్యవేక్షణ చేయాలని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర మిశ్రా ధర్మాసనం ఆదేశించింది. అందుకే పిటిషన్‌ను మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది.

## గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లడమే లక్ష్యం



విజయవాడ: పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రూట్ మ్యాప్ ప్రకారం ప్రాజెక్టు పనులు చేస్తున్నట్లు చెప్పారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం ఎడమ కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి ఆ ప్రాంతం రుణం తీర్చుకుంటామన్నారు. "రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజిన్ సర్కారు ఉంటే ఎంత మేలు జరుగుతుందో ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు అర్థమవుతోంది. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పోలవరంతో పాటు.. ప్రకాశం జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత ప్రభుత్వం చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. 2025లో చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని నిమ్మల రామానాయుడు తెలిపారు.

## రాజధాని పరిధిలో రిజిస్ట్రేషన్ విలువను పెంచబోం: మంత్రి అనగాని



అమరావతి: గత ప్రభుత్వంలో చేసిన భూ అరాచకాలతో ప్రజలకు తీవ్ర సమస్యలు తలెత్తాయని.. రెవెన్యూ సదస్సుల ద్వారా వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్నామని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. పేదలకు చెందిన భూముల వివరాలు మార్చే ప్రయత్నం చేసిన అధికారులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింహాచలం పంచగ్రామాల భూముల సమస్యపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకుని పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ విలువల హేతుబద్ధీకరణ త్వరలో ఉంటుందని అనగాని తెలిపారు. గుంటూరు, మార్కాపురం తదితర ప్రాంతాల్లో బుక్ వాల్యూ తక్కువే ఉందన్నారు. కొన్ని చోట్ల తగ్గిస్తే.. మరికొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ విలువలు పెరుగుతాయన్నారు. నాలా పన్ను కూడా రేషనలైజ్ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రోత్ కారిడార్లలో రిజిస్ట్రేషన్ విలువల పెంపు ఉంటుందని చెప్పారు. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంచకూడదని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రాబోతున్నాయని అనగాని చెప్పారు. దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబును చాలా మంది పారిశ్రామికవేత్తలు కలిసి హామీ ఇచ్చారన్నారు. వైకాపా నిర్బంధాలకు వ్యతిరేకంగా చేసిన 'యువగళం' పాదయాత్రకు నేటితో రెండేళ్లు పూర్తయిందని చెప్పారు. జగన్ ప్రభుత్వ అడ్డంకులన్నీ అధిగమించి లోకేశ్ పాదయాత్ర చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలనూ రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని చెప్పారు.

## బీపీఎల్ కుటుంబాలకే ఉచిత ఇంటి స్థలం: ఏపీ ప్రభుత్వం

అమరావతి: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకే ఉచిత ఇంటి స్థలం కేటాయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వివిధ అర్హత నిబంధనలు పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ ఇస్తుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. పదేళ్ల కాలపరిమితితో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించేలా కన్వేయన్స్ డీడ్ ఇవ్వనున్నట్లు తెలిపింది. జీవితకాలంలో ఒకసారే ఉచిత ఇంటిపట్టా ఇచ్చేలా విధివిధానాలు రూపొందించారు. ఇంటిపట్టా ఇచ్చిన రెండేళ్లలోగా నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. లబ్ధిదారులకు రాష్ట్రంలో ఎక్కడా ఇంటిస్థలం, సొంతిల్లు ఉండకూడదని నిబంధన విధించింది. కేంద్ర, రాష్ట్ర గృహనిర్మాణ పథకాల్లోనూ లబ్ధిదారుగా ఉండకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## బేబీ ఎంత కష్టపడుతుందో చూడండి


యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్ చేయడంతో పాటు, టాలీవుడ్ సినిమాల్లో అప్పుడప్పుడు కనిపిస్తూ వచ్చిన వైష్ణవి చైతన్య 2023లో బేబీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన ఆ సినిమాలో వైష్ణవి చైతన్య నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయ్యారు. ఇన్నాళ్లు ఎక్కడ ఉన్నావు అమ్మడు అంటూ ఆ సమయంలోనే వైష్ణవికి ఫ్యాన్ అయిన వారు చాలా మంది ఉన్నారు. బేబీ సినిమాతో ఒక్కసారిగా ఆఫర్లు ఇబ్బడి ముబ్బడిగా ఈ అమ్మడికి రావడం ప్రారంభం అయ్యింది. కానీ ఆచితూచి ఈమె సినిమాలను ఎంపిక చేసుకుంటూ ఉంది. బేబీ సినిమాతో వచ్చిన గుర్తింపుతో గత ఏడాది 'లవ్ మీ' సినిమాతో వచ్చింది. దిల్ రాజు ప్రొడక్షన్ నుంచి వచ్చిన ఆ సినిమా పర్వాలేదు అనిపించింది. అంతే కాకుండా మరోసారి వైష్ణవి నటిగా మంచి పేరు సొంతం చేసుకుంది. చూడ్డానికి సన్నగా నాజూకుగా కనిపించే వైష్ణవి చైతన్య సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఆమె తన అందమైన ఫోటోలను షేర్ చేయడంతో పాటు, అప్పుడప్పుడు ఇలా వర్కౌట్ వీడియోలను, ఫోటోలను సైతం షేర్ చేస్తూ వస్తోంది.



తాజాగా వైష్ణవి చేసిన ఈ వర్కౌట్ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. క్యూట్‌గా ఉన్న వైష్ణవి ఎంత కష్టపడుతుందో అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈసారి వైష్ణవి ట్రైనర్ రాజ్ సోషల్ మీడియా ద్వారా ఈ ఫోటోలను షేర్ చేశాడు. మూడు సంవత్సరాల నుంచి మీకు ట్రైనింగ్ ఇస్తున్నాను. అందరికంటే మీరు ఎక్కువ కష్టపడే వ్యక్తి. శిక్షణలో చాలా ఇబ్బందులు పెట్టినా మీరు ఎప్పుడూ సానుకూలంగానే తీసుకుని దానికి తగ్గట్లుగా రెడీ అవుతూ వస్తున్నారు. ఫిట్ నెస్ విషయంలో మీకు ఉన్న శ్రద్ధ నిజంగా అద్భుతం. నేను ఇంత అందమైన అమ్మాయికి శిక్షణ ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని కూడా సోషల్ మీడియా ద్వారా షేర్ చేశాడు. ఈ ఫోటోలు వైష్ణవి చైతన్య చాలా సన్నగా నాజూకుగా కనిపిస్తుంది. అయినా వర్కౌట్స్ ఎందుకు అంటూ చాలా మంది ప్రశ్నిస్తున్నారు. సన్నగా ఉన్నంత మాత్రాన వర్కౌట్స్ చేయకూడదని లేదు. ఫిజికల్‌గానే కాకుండా మెంటల్‌గానూ స్ట్రాంగ్‌గా మారడం కోసం చాలా మంది వర్కౌట్స్ చేస్తారు. తన అందం కాపాడుకోవడంతో పాటు, ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండటం కోసం వర్కౌట్స్ చేస్తూ ఉండవచ్చు. హీరోయిన్స్ అంటే అంతా నాజూకుగా ఉంటారని అనుకుంటారు. కానీ వారు అందుకోసం చాలా కష్టపడాల్సి ఉంటుందని వైష్ణవి పడుతున్న కష్టంను చూస్తే అర్థం అవుతుంది. వైష్ణవి చైతన్య ప్రస్తుతం జాక్ సినిమాతో పాటు టైటిల్ ఫిక్స్ కానీ మరో సినిమాలోనూ నటిస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.

## ఒక్క ఫోటోతో డేటింగ్ పుకార్లా.. అంత వద్దు!

సోషల్ మీడియా కొత్త పెయిర్ గురించి గుసగుసలాడుతోంది. ప్రస్తుతం జనం దృష్టి ప్రముఖ గాయని ఆశా భోంస్లే మనవరాలు, నటి కం గాయని జనాయ్ భోంస్లే - భారత క్రికెటర్ మహమ్మద్ సిరాజ్ పైనే ఉంది. ముంబై- బాంద్రాలో జనాయ్ బోంస్లే తన 23వ పుట్టినరోజు వేడుకల ఫోటోలను షేర్ చేసారు. ఈ ఫోటోగ్రాఫ్స్‌లో టీమిండియా క్రికెటర్ సిరాజ్‌తో కలిసి ఉన్న ఒకే ఒక్క ఫోటోగ్రాఫ్ డేటింగ్ పుకార్లకు తెరతీసింది. నెటిజన్లు వారి స్నేహానికి పులకించిపోయారు. ఆ ఇద్దరి మధ్యా ఏదో జరుగుతోందంటూ వ్యాఖ్యానించారు. ఈ ఫోటోగ్రాఫ్ లో ఆ ఇద్దరి మధ్యా చనవు కనిపించింది. జనాయ్- సిరాజ్ ఒకరినొకరు ప్రేమగా చూసుకుంటూ తన్మయంలో కనిపించారు. జనాయ్ అమ్మమ్మ ఆశాజీ, నటుడు జాకీ ష్రాఫ్, క్రికెటర్లు సిద్ధేష్ లాడ్, శ్రేయాస్ అయ్యర్ తదితరులు ఈ పార్టీలో ఉన్నారు. అయితే అంతమందిలో ఆ ఇద్దరి ప్రత్యేక ఫోటోగ్రాఫ్ అందరి దృష్టిని కట్టిపడేసింది. అయితే ఈ పుకార్లపై జనాయ్ కానీ, సిరాజ్ కానీ స్పందించలేదు. బోంస్లే మీరు సిరాజ్ భాయిజాన్ ని పెళ్లి



చేసుకోబోతున్నారా? అని ఒక నెటిజన్ ప్రశ్నించాడు. డిఎస్పి సాహబ్ అంటే యహా మే పిగల్ గయా అని మరొకరు వ్యాఖ్యానించారు. ఈ ఊహాగానాలకు తగ్గట్టే సిరాజ్ తదుపరి ఐపీఎల్ సీజన్ కోసం గుజరాత్ టైటాన్స్ లో చేరడాన్ని పలువురు ఫ్యాన్స్ ప్రత్యేకంగా పాయింట్ అవుట్ చేసారు. జనాయ్ స్వరానికి ఎవరైనా ప్రేమలో పడిపోవాల్సిందే. ఆ మధుర స్వరానికి ఇప్పటికే భారీ ఫాలోవర్స్ ఏర్పడ్డారు. అందువల్ల సిరాజ్ త్వరపడితేనే మంచిదని కూడా కొందరు సూచిస్తున్నారు. త్వరలోనే జనాయ్ కొత్త మ్యూజిక్ ప్రాజెక్ట్ తో అభిమానుల ముందుకు రానుంది. మరోవైపు మహమ్మద్ సిరాజ్ గుజరాత్ టైటాన్స్‌తో కొత్త సీజన్ కోసం సిద్ధమవుతున్నాడు. కొత్త సీజన్‌లో ఇతరులను అతడు బౌల్డ్ చేస్తాడో లేదా అతడే ఆమెకు క్లీన్ బౌల్డ్ అవుతాడో చూడాలి అంటూ కొందరు పరిహాసం ఆడుతున్నారు. ప్రేమో మోహమో స్నేహమో కాస్త ఆగితే క్లారిటీ వచ్చేస్తుంది.. జస్ట్ వెయిట్! అని ఒక అభిమాని వ్యాఖ్యానించాడు. సంగీతం క్రికెట్ జతగా కలిస్తే మంచిదేగా అని కూడా చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ అందమైన జంట నెటిజనుల మనసు దోచుకుంది.




## అనంత నిధి కోసం సుధీర్ బాబు 'జటాధర'




తెలుగు సినిమా ప్రేక్షకులకు మరో విభిన్నమైన అనుభూతిని ఇవ్వడానికి సుధీర్ బాబు మరో ప్రయోగంతో రాబోతున్నాడు. అతని కొత్త సినిమాకు జటాధర అనే టైటల్ ఫిక్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ సినిమాను జీ స్టూడియోస్ బాలీవుడ్ నిర్మాణ సంస్థలకు పేరుగాంచిన ప్రెర్నా అరోరా గ్రాండ్ గా నిర్మించనున్నాయి. ఇంతకుముందు బాలీవుడ్‌లో రుస్తమ్, ప్యాడ్‌మ్యాన్, టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ లాంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ప్రెర్నా అరోరా, ఇప్పుడు తెలుగు సినిమా రంగంలో ఒక భారీ ప్రాజెక్ట్‌ను నిర్మించడం విశేషం. సుదీర్ బాబు ఇప్పటికే తన పాత్ర కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. పూర్తిగా న్యూ లుక్ తో నెవ్వర్ బిఫోర్ అనే ఫిట్నెస్ తో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రం కథాంశం అనంత పద్మనాభస్వామి ఆలయ నేపథ్యంతో సాగనుందని సమాచారం. ఆలయంలో దాగి ఉన్న నిధులు, విభిన్న శాస్త్రీయ ఆధ్యాత్మిక పరిణామాల చుట్టూ కథ నడవనుందట. భారతీయ చరిత్ర పౌరాణిక అంశాలను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. దర్శకుడు వెంకట్ కళ్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫిబ్రవరి నుంచి సెట్స్‌పైకి వెళ్లనుంది. సినిమా కథ మాత్రమే కాకుండా దాని కథన విధానం కూడా ప్రేక్షకులను ఆశ్చర్యపరచేలా ఉండనుందని అంటున్నారు.

జీ స్టూడియోస్ సీఈఓ ఉమేష్ కేఆర్ బన్సాల్ ఈ సినిమా గురించి మాట్లాడుతూ, ఇది భారత చరిత్రలోని కొన్ని ఆసక్తికరమైన కోణాలను, పౌరాణిక విశేషాలను వెలుగులోకి తీసుకువస్తుందని చెప్పారు. జీ స్టూడియోస్, ప్రెర్నా అరోరా కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలను ఏర్పరచింది. సినిమాలో సాంకేతిక నిపుణుల గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉన్నా, చిత్రబృందం ఇప్పటికే అత్యున్నత ప్రమాణాలతో సినిమాను తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. లేటెస్ట్ గా రిలీజ్ చేసిన పోస్టర్ కూడా ఆసక్తికరంగా ఉంది. జటాధర తెలుగు సినీ పరిశ్రమలోనే నెవ్వర్ బిఫోర్ అనేలా ఉండనున్నట్లు తెలుస్తోంది. సుదీర్ బాబు, తన పాత్ర కోసం ప్రత్యేక శిక్షణ తీసుకోవడం సినిమా విజయం కోసం ఆయన పెడుతున్న కృషిని తెలియజేస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైన తర్వాత మరిన్ని అప్‌డేట్స్ అందించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. మొత్తం మీద, జటాధర సినిమా తెలుగు సినిమా ప్రేక్షకులకు, అలాగే పాన్ ఇండియా మార్కెట్ లో మంచి హైప్ క్రియేట్ చేయబోతోంది. త్వరలో విడుదలకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నట్లు సమాచారం.

## రాబిన్ హుడ్.. ఏదో గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు




నితిన్ హీరోగా వెంకి కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాబిన్ హుడ్'. 'భీష్మ' తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో వస్తోన్న రెండో సినిమా కావడంతో అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ చిత్రంలో నితిన్ కి జోడీగా క్రేజీ హీరోయిన్ శ్రీలీల నటించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్ కంప్లీట్ చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. నిజానికి 2024 డిసెంబర్ 21న ఈ సినిమాని రిలీజ్ చేస్తామని మేకర్స్ ముందుగా ప్రకటించారు. తరువాత ఆ డేట్ వాయిదా పడింది. మార్చి 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకి రానుంది. అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని వెంకి కుడుముల తెరకెక్కించారు. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ మూవీ టీజర్ కి మంచి స్పందన వచ్చింది. 'భీష్మ' తరహాలోనే ఫుల్ ఫన్ రైడ్ గా ఈ చిత్రం కూడా ఉండబోతోందని టీజర్ బట్టి తెలుస్తోంది. ఇదిలా ఉంటే రిపబ్లిక్ డే సందర్భంగా మేకర్స్ రాబిన్ హుడ్ మేకింగ్ వీడియో ని రిలీజ్ చేశారు. అయినవాళ్ల దగ్గర తీసుకోవడం నా హక్కు%ో% మై బేసిక్ రైట్.. బికాజ్ ఇండియా ఈజ్ మై కంట్రీ ఆల్ ఇండియన్స్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అని నితిన్ చెప్పే డైలాగ్ ని హైలైట్ చేశారు. ఆల్ ఇండియన్స్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అనే డైలాగ్ ని హైలైట్ చేశారు. అలాగే షూటింగ్ కి సంబంధించిన విజువల్స్ ఈ మేకింగ్ వీడియోలో పంచుకున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా నితిన్ ఫ్యాన్స్ తో పాటు ఆల్ ఇండియన్స్ కి విషెస్ చెబుతూ ఈ మేకింగ్ వీడియోని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో నితిన్ ఒక దొంగగా కనిపించబోతున్నాడు. అతని క్యారెక్టరైజేషన్ ఫుల్ ఫన్ జెనరేట్ చేసే విధంగా ఉండబోతోందని తెలుస్తోంది. ఈ సినిమాని నితిన్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. చేస్తోంటే 'రాబిన్ హుడ్' తో ఏదో గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడు అని అనిపిస్తుంది. శ్రీలీలకి కూడా హీరోయిన్ గా ఈ సినిమా సక్సెస్ చాలా అవసరం అని చెప్పాలి.

మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇప్పటికే సినిమా నుంచి ఒక సాంగ్ కూడా రిలీజ్ అయ్యి మంచి రెస్పాన్స్ సొంతం చేసుకుంది. నితిన్ ఫ్యాన్స్ కూడా ఈ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. దీంతో పాటు నితిన్ వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' మూవీ కూడా చేస్తున్నారు. దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## సహజ అందంతో చక్కిలిగింతలు పెడుతోంది

తనదైన సహజ అందంతో హృదయాలను గెలుచుకున్న జయప్రద, సుహాసిని, సుమలత వంటి నటీమణులకు వారసురాలిగా కనిపిస్తోంది భాగ్యశ్రీ బోర్సే. చూపులు తిప్పుకోనివ్వని, గిలిగింతలు పెట్టే అందం ఈ భామ సొంతం. తాజా ఇన్‌స్టా పోస్ట్ దీనిని మరోసారి ధృవీకరించింది. భాగ్యశ్రీ బ్లాక్ ఫ్రాక్‌లో మేకప్ లెస్ లుక్ లో ఎంతో నేచురల్‌గా కనిపించింది. సింపుల్‌గా కనిపిస్తూనే గుండెల్ని హత్తుకుంది ఈ భామ. వాలు చూపులతో వలపు బాణాలు వేస్తోంది. అందానికి అందం ప్రతిభతో ఆకట్టుకుంటున్న భాగ్యశ్రీ టాలీవుడ్ లో బిజీ నాయికగా వెలిగిపోతోంది. తెలుగు చిత్రసీమలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే వరుస అవకాశాల్ని అందుకుంది. విజయ్ దేవరకొండ



సరసన ఓ చిత్రంలో, నాని సరసన మరో చిత్రంలో భాగ్యశ్రీ అవకాశాలు అందుకుందని కథనాలొచ్చాయి. భాగ్యశ్రీ స్వగతంలోకి వెళితే... నైజీరియాలోని లాగోస్ లో భాగ్యశ్రీ బోర్సే చదువుకుంది. భారతదేశం తిరిగి వచ్చి బిజినెస్ మేనేజ్మెంట్ డిగ్రీలో చేరింది. ఆ సమయంలోనే మోడలింగ్ కెరీర్ గా ఎంచుకుని ఒక ఏజెన్సీతో కలసిపనిచేసింది. పలు బ్రాండ్లకు అంబాసిడర్ గా వ్యవహరించింది. క్యాడ్‌బరీ డైరీ మిల్క్ సిల్క్ యాడ్ తో భాగ్యశ్రీ బాగా పాపులరైంది. అలా బాలీవుడ్ చిత్రం యారియాన్ 2లో రాజ్యలక్ష్మి పాత్రలో తన నటనతో యువతను ఆకట్టుకుంది. ఆ తరువాత, చందు ఛాంపియన్ లోనూ నటించింది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన మిస్టర్ బచ్చన్ (2024) చిత్రంలో రవితేజ సరసన భాగ్యశ్రీ నటించింది. మిస్టర్ బచ్చన్ తర్వాత భాగ్యశ్రీ నటించే సినిమాల గురించి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## శ్రీలీల.. ఘాటైన లుక్కులో హై గ్లామర్ డోస్

సౌత్ ఇండియాలో స్టార్ హీరోయిన్ గా వరుస సినిమాలతో దూసుకుపోతున్న ముద్దుగుమ్మ శ్రీలీల. ఈ అమ్మడు గత ఏడాది 'పుష్ప 2'లోని దెబ్బలు పడతాయ్ సాంగ్ తో దేశ వ్యాప్తంగా విశేషమైన పాపులారిటీ సొంతం చేసుకుంది. ఈ సాంగ్ తర్వాత అమ్మడికి నార్త్ లో కూడా క్రేజ్ పెరిగింది. దీంతో హిందీలో హీరోయిన్ గా ఓ క్రేజ్ ప్రాజెక్ట్ కి సైన్ చేసింది. రీసెంట్ గా ఈ విషయాన్ని మేకర్స్ ధృవీకరించారు. బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ కి జోడీగా శ్రీలీల ఎంట్రీ ఇవ్వబోతోంది. ఈ చిత్రాన్ని ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. దీంతో పాటు శ్రీలీల కోలీవుడ్ లోకి కూడా అడుగుపెడుతోంది. శివ కార్తికేయన్ కి జోడీగా ఆమె కోలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. సుధా కొంగర దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. రీసెంట్ గా ఈ మూవీ ప్రారంభోత్సవం జరిగింది. తెలుగులో క్రేజీ హీరోయిన్ గా స్టార్ హీరోల ఫస్ట్ ఛాయస్ గా మారిపోయిన శ్రీలీల ఇప్పుడు కోలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీలలోకి



కూడా అడుగుపెట్టడం ద్వారా పాన్ ఇండియా హీరోయిన్ ఇమేజ్ వైపు దూసుకుపోతోంది. ఇదిలా ఉంటే ఆమె నితిన్ కి జోడీగా చేసిన 'రాబిన్ హుడ్' రిలీజ్ కి రెడీ అవుతోంది. అలాగే శ్రీలీల సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన అప్డేట్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తుంది. రష్మిక తర్వాత యూత్ క్రష్ గా మారిపోయిన శ్రీలీల ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆమె డాన్స్, పెర్ఫార్మెన్స్, అందానికి చాలా మంది యువత ఫ్యాన్స్ గా మారిపోతున్నారు. ప్రస్తుతం తెలుగులో బెస్ట్ డాన్స్ చేసే హీరోయిన్స్ లలో సాయి పల్లవితో సమానమైన ఇమేజ్ గుర్తింపుని శ్రీలీల అందుకుంది. ఇక శ్రీలీల గ్లామర్ రోల్స్ కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో స్టార్ హీరోలకి జోడీగా ఛాన్స్ లు అందుకుంటుంది. తాజాగా ఈ అమ్మడు వైట్ కలర్ స్కర్ట్ లో క్యూట్ లుక్స్ తో ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్లీవ్ లెస్ గా ఉన్న ఈ స్కర్ట్ లో శ్రీలీల చాలా గ్లామరస్ గా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.



## ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ పథకం 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నారాయణపేటకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ పిటిషన్ వేశారు. భూమి లేని రైతు కూలీలలకు ఏటా రూ.12వేలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం రూపొందించిందని.. మున్సిపాలిటీల పరిధిలో ఉన్న రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని పిటిషనర్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో 129 మున్సిపాలిటీల్లో 8లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు తెలిపారు. గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకు ఇచ్చి మున్సిపాలిటీల్లోని వారికి ఇవ్వకపోవడం సరికాదన్నారు. రైతు కూలీలు ఎక్కడ ఉన్నా అందరూ సమానమేనని చెప్పారు.

కేవలం గ్రామాల్లో ఉన్న రైతు కూలీలకే ఈ పథకం వర్తింపజేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమన్నారు. అనంతరం హైకోర్టు స్పందిస్తూ 4 వారాల్లో మున్సిపాలిటీల్లోని రైతు కూలీలను 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకంలోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈమేరకు సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది.



## రేషన్ ఇచ్చేది కేంద్రమైతే.. రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎందుకు?

హైదరాబాద్: కేంద్ర సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం పేర్లనే రాష్ట్రాలు పెట్టాలని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తే ఇందిరమ్మ పేరు ఎలా పెడతారని ప్రశ్నించారు. రేషన్ ఇచ్చేది కేంద్రమైతే రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎందుకు పెడుతున్నారన్నారు. పేదల ఇళ్ల కోసం కాకుండా పేర్ల కోసం కాంగ్రెస్ నేతలు పాకులాడుతున్నారని విమర్శించారు. ఇస్తామన్న ఆరు గ్యారంటీలు ఇంకా ఎందుకు అమలు చేయట్లేదని నిలదీశారు. "రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి సహకరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర్లను మార్చేస్తోంది. మాకు ఎలాంటి భేషజాలు లేవు.. కేంద్రం, రాష్ట్రం కలిస్తేనే అభివృద్ధి.

పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికి ఇస్తాం. గద్దర్‌కు అవార్డు ఎలా ఇస్తాం? భాజపా కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం. తెలంగాణ సెంటిమెంట్‌తో లాభపడింది ఎవరో ప్రజలకు తెలుసు" అని బండి సంజయ్ అన్నారు.

## సింగర్ మధుప్రియ సాంగ్ షూటింగ్ వివాదం.. అధికారులపై వేటు..



జయశంకర్ భూపాలపల్లి: శ్రీకాళేశ్వర ముక్తేశ్వర దేవాలయంలో సింగర్ మధుప్రియ సాంగ్ షూటింగ్ వివాదంలో కథనాలపై తెలంగాణ దేవాదాయశాఖ స్పందించింది. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఈవో మారుతిపై బదిలీ వేటు పడింది. ఆలయ ఈవోను కరీంనగర్ జిల్లా మానుకొండూర్ గుట్టుదుద్దనపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయానికి దేవాదాయశాఖ అధికారులు బదిలీ చేశారు. మారుతి స్థానంలో కాళేశ్వర ముక్తేశ్వరస్వామి ఆలయానికి గతంలో ఈవోగా పనిచేసి కొడవటంచ లక్ష్మీనరసింహ దేవస్థానానికి బదిలీ అయిన గ్రేడ్-1 అధికారి మహేశ్‌కు మళ్లీ బాధ్యతలు అప్పగించారు. అలాగే షూటింగ్ సమయంలో విధుల్లో ఉన్న అర్చకుడు రామకృష్ణకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కాగా, ఈనెల 20న అనుమతి లేకుండా ముక్తేశ్వర ఆలయ గర్భగుడిలో సింగర్ మధుప్రియ ప్రైవేటు ఆల్బమ్ షూటింగ్ చేశారు. దీనిపై తీవ్ర వివాదం చెలరేగింది. సాధారణంగా కాళేశ్వర ఆలయంలో ఫొటోలు, వీడియోలు తీయడానికి అనుమతి ఉండదు. కానీ, ఎలాంటి అనుమతులు లేకుండా మధుప్రియ పాటలు చిత్రీకరించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న ఈ వివాదంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

## అర్హులందరికీ రైతు భరోసా జమ చేస్తాం: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేసే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో మండలానికి ఒక గ్రామంలో రైతు భరోసా సొమ్ము విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సొమవారం రాష్ట్ర వ్యాప్తంగా 4,41,911 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు చెప్పారు.

577 మండలాల్లోని 9,48,333 ఎకరాలకు గాను రూ.530 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా ఇస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## హుస్సేన్‌సాగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో యువకుడు మిస్సింగ్

హైదరాబాద్: హుస్సేన్‌సాగర్ లో రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం ఘటనలో ఓ యువకుడి ఆచూకీ తెలియడంలేదు. అగ్ని ప్రమాదంలో రెండు బోట్లు దగ్ధమవగా ఒక్క బోటులో ఫ్రండ్స్‌తో వెళ్లిన అజయ్ (21) (%ాయిఖఎ%) అనే యువకుడు కనిపించడం లేదు. అజయ్‌తోపాటు వెళ్లిన ఫ్రండ్స్ మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. అజయ్ ఏ ఆస్పత్రిలోనూ లేదని పోలీసులు చెబుతుండడంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. అజయ్ ఫ్రండ్స్ నుంచి లేక్ పోలీస్ స్టేషన్ పోలీసులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

**భరతమత మహా హారతిలో అపశ్రుతి** ... కాగా భరతమాత పౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వద్ద 'భరతమాత మహా హారతి' కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. రెండు బోట్లలో బాణసంచా పేల్చడానికి కొందరు యువకులు రెండు బోట్లలో హుస్సేన్‌సాగర్ మధ్యలోకి వెళ్లారు. బాణసంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి అగ్నిప్రమాదం సంభవించింది. నిప్పురవ్వలు తిరిగి అవే బోట్లలో ఉంచిన బాణసంచాపై పడటంతో బోట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో రెండు బోట్లు దగ్ధం కాగా.. అందులో ఉన్నవారు స్వల్పగాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. వారిలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నాగారానికి చెందిన అజయ్ తన కొలిగ్స్‌తో కలిసి హుస్సేన్‌సాగర్‌కు వచ్చాడు. అయితే బోట్స్‌లో అజయ్ ఉన్నట్లు ఫ్రండ్స్ చెబుతున్నారు. బోట్‌లో అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అందులో ఉన్నవారు అందరూ నీటిలోకి దూకారు. అదే సమయంలో అజయ్‌తోపాటు అతని స్నేహితులు ఉన్నారు. వారు సురక్షితంగా బయటపడ్డారు. అయితే అజయ్ ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అజయ్ ఎక్కడా ఏ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని.. ఇదే విషయాన్ని పోలీసులు కూడా స్పష్టం చేశారు. అజయ్ అనే పేరుతో ఎవరూ ఆస్పత్రిలో జాయిన్ కాలేదని, క్షతగాత్రుల వివరాల్లో అజయ్ పేరు లేదని పోలీసులు తెలిపారు. దీంతో అజయ్ ఏమయ్యాడనే ఆందోళన కుటుంబసభ్యుల్లో నెలకొంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆదివారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన 'భరతమాత మహా హారతి' కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అయితే కార్యక్రమం పూర్తయ్యాక పీపుల్స్ ప్లాజా సమీపంలో వేదిక వెనుక భాగంలో బాణసంచా కాల్చేందుకు పర్యాటక శాఖకు చెందిన రెండు బోట్లలో సామగ్రిని హుస్సేన్‌సాగర్ మధ్యలోకి తీసుకెళ్లారు. బోటులో డ్రైవర్, వాల్టర్, సిబ్బంది, బాణసంచా కాల్చే ఐదుగురు నిపుణులతోపాటు 15 మంది బీజేపీ కార్యకర్తలు ఉన్నారు. అయితే బాణసంచా కాల్చే క్రమంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో బోట్లలో ఉన్న కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు నీళ్లలోకి దూకారు. రంగంలోకి దిగిన అధికారులు.. జెట్టీలో మంటలను అదుపులోకి తెచ్చే పరికరాలు లేకపోవడంతో వారిని స్పీడ్‌బోట్‌లో బయటకు తీసుకువచ్చారు. అయితే ప్రమాదంలో బాణసంచా కాల్చే నిపుణుడు గణపతి (22)కి తీవ్ర గాయాలయ్యాయి. ఇతనితోపాటు ప్రమాదంలో గాయపడిన చింతల కృష్ణ (47), కరీంనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి సాయిచంద్‌ను సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గణపతి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, సీతాఫల్‌మండికి చెందిన బీజేపీ కార్యకర్తలు సునీల్, ప్రణీత్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, కాలిపోయిన లూంబిని బోట్ విలువ రూ.12 లక్షలు ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.



## ఆమెను తొలగించండి.. హసీనా కుటుంబంపై బంగ్లా ప్రభుత్వం ప్రతీకారం

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుటుంబాన్ని ఇబ్బందిపెట్టేందుకు అక్కడి ప్రభుత్వం వెనుకాడటం లేదు. ఇప్పటికే పలు కేసుల్లో ఆమె కుటుంబసభ్యుల పేర్లను చేర్చిన యూనస్ సర్కారు తాజాగా ఆమె కుమార్తె సైమా వాజెద్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ పదవి నుంచి తప్పించేలా పావులు కదుపుతోంది. ప్రస్తుతం సైమా డబ్ల్యూహెచ్‌వో ఆగ్నేయ ఆసియా ప్రాంతీయ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె దిల్లీ కేంద్రంగా పని చేస్తున్నారు. వృత్తిరీత్యా సైకాలజిస్ట్ అయిన సైమా.. నాడీ సంబంధ రుగ్మతలపై పని చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ ఆమెను ప్రాంతీయ డైరెక్టర్‌గా ఎంపిక చేసింది. దీంతో 2024 జనవరిలో ఆమె బాధ్యతలు చేపట్టారు. బంగ్లాదేశ్ ప్రభుత్వానికి చెందిన యాంటీ కరెప్షన్ కమిషన్(ఏసీసీ) సంస్థ తన దర్యాప్తులో సైమాపై పలు ఆరోపణలు చేసింది. ఇక చర్యలు తీసుకోవడానికి వీలుగా ఆ సంస్థ పావులు కదుపుతోంది. "ఆమెను డబ్ల్యూహెచ్‌వో పదవి నుంచి తప్పించేందుకు ఏసీసీ ఇప్పటికే పలు చర్యలు తీసుకొంది. ఇందులోభాగంగా ఏసీసీ దేశంలోని వైద్య, విదేశాంగశాఖలకు లేఖలు పంపేందుకు అంతా సిద్ధం చేశాం" అని ఓ అధికారి పేర్కొన్నారు. మరోవైపు షేక్‌హసీనాను అరెస్టు చేయడానికి కూడా బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అవసరమైతే అంతర్జాతీయ మద్దతు కూడగడతామని వెల్లడించింది. ఈక్రమంలో అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ ఇప్పటికే అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఇక ఆమెను అప్పగించాలని బంగ్లాదేశ్ న్యూదిల్లీకి పలు మార్లు లేఖలు రాసింది. హసీనా ప్రభుత్వం అనంతరం అధికారం చేపట్టిన మహమ్మద్ యూనస్ హయాంలో భారత్‌తో సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అంతేకాదు.. పాక్‌తో ఢాకా అంటకాగుతోందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.



## ట్రంప్ హెచ్చరికల వేళ.. కొలంబియా యూటర్న్

వాషింగ్టన్: అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తూ.. ప్రత్యేక విమానాల్లో వారిని స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ చర్యలను ముందుగా వ్యతిరేకించిన కొలంబియా అనంతరం వెనక్కి తగ్గి అగ్రరాజ్యం పెట్టిన నిబంధనలకు అంగీకరించిందని వైట్‌హౌస్ పేర్కొంది. కొలంబియా వెనక్కి తగ్గి స్వదేశానికి తిరిగి వచ్చిన పౌరులను ఆహ్వానించడంతో తాము ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలిపివేయనున్నట్లు అమెరికా ప్రకటించింది. "అమెరికా సార్వభౌమత్వాన్ని పరిరక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. యూఎస్‌లో చట్టవిరుద్ధంగా ఆశ్రయం పొందుతున్న తమ పౌరులను వెనక్కి పిలుపించుకోవడానికి ప్రపంచ దేశాలు తగిన చర్యలు తీసుకొని మాకు సహకరించాలి" అని వైట్‌హౌస్ పేర్కొంది. అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను ప్రత్యేక విమానాల్లో వారివారి స్వదేశాలకు పంపడానికి అగ్రరాజ్యం అనుసరిస్తున్న తీరుపై పలు దేశాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇలా వలసదారులను తీసుకొచ్చే విమానాలను తమ దేశంలోకి అనుమతించమని కొలంబియా తేల్చి చెప్పింది. "కొలంబియా వలసదారులను తీసుకువచ్చే అమెరికా విమానాలను దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నా' అని ఆ దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో ఇటీవల పేర్కొన్నారు. వలసదారులను గౌరవంగా పంపించేందుకు అమెరికా నిబంధనలు రూపొందిస్తేనే వాటిని అనుమతిస్తామన్నారు. ఇప్పటికే అమెరికా సైనిక విమానాలను వెనక్కి పంపించినట్లు చెప్పారు. వలసదారులను నేరస్థులుగా చిత్రీకరించకుండా, అమెరికా పౌర విమానాల్లో పంపిస్తేనే వాటిని తమ దేశంలోకి అనుమతిస్తామని పెట్రో పేర్కొన్నారు.

**త్వరలో పుతిన్‌తో మాట్లాడతా: ట్రంప్...** దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కొలంబియా ఉత్పత్తులపై సుంకాలు 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. కొలంబియన్ ప్రభుత్వ అధికారుల వీసాలను వెంటనే రద్దు చేస్తానని అన్నారు. ఈ చర్యలు ఆరంభం మాత్రమే అని.. తమ నిబంధనలను పాటించి ప్రపంచ దేశాలు తమ పౌరులను తిరిగి వెనక్కి ఆహ్వానించకపోతే వారిపై మరిన్ని సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మరోవైపు అమెరికా అనుసరిస్తున్న విధానంపై బ్రెజిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలా వలసదారుల చేతులకు సంకెళ్లు వేసి పంపించడాన్ని తీవ్రంగా పరిగణించింది.



## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. తిరుపతన్నకు బెయిల్

దిల్లీ: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అదనపు ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. 10 నెలలుగా పిటిషనర్ జైలులో ఉన్నారని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేశారన్నారు. ఇంకా జైలులో ఉండాల్సిన అవసరం కనిపించడం లేదని పేర్కొంది. "ట్రయల్‌కు తిరుపతన్న పూర్తిగా సహకరించాలి, జాప్యం చేయడానికి ప్రయత్నించవద్దు. సాక్షులను ప్రభావితం చేసినా, కేసులో ఆధారాలు చెరిపేయడానికి ప్రయత్నించినా రాష్ట్ర ప్రభుత్వం బెయిల్ రద్దుకు కోర్టును ఆశ్రయించవచ్చు. పాస్‌పోర్టు రద్దు సహా ఇతర బెయిల్ షరతులు అన్నింటినీ ట్రయల్ కోర్టు ఇస్తుంది" అని సుప్రీంకోర్టు తెలిపింది. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది లూథ్రా వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో తిరుపతన్నే ప్రధాన నిందితుడని ఆయన తెలిపారు. దీనిలో ఆయన పాత్రపై దర్యాప్తునకు మరో 4 నెలల సమయం పడుతుందన్నారు. కొంత మంది కీలక సాక్షులను ఇంకా విచారించాల్సి ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో తిరుపతన్నకు బెయిల్ ఇవ్వొద్దన్నారు. రాజకీయ నేతల ఆదేశాలతో హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఆయన ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. ఆధారాలు చెరిపేయడంలో కూడా కీలకంగా ఉన్నారన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఆధారాలన్నీ ధ్వంసం చేశారని వివరించారు. తిరుపతన్న పాస్‌పోర్టును వెంటనే సరెండర్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. కేసులో కీలకమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే విదేశాలకు పారిపోయారని లూథ్రా తెలిపారు.

## హైకోర్టును ఆశ్రయించిన భాజపా ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్: భాజపా ఎంపీ ఈటల రాజేందర్ హైకోర్టును ఆశ్రయించారు. పోచారం పీఎస్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను



కొట్టివేయాలని కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఏకశిలానగర్‌లో స్థిరాస్తి వ్యాపారిపై చేయిచేసుకున్నారని ఈటలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకున్నారు. దీంతో ఈటల హైకోర్టును ఆశ్రయించారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఆమోదం

వక్ఫ్ సవరణ బిల్లు పరిశీలన కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించినట్లు ప్యానెల్ ఛైర్మన్ జగదాంబిక పాల్ వెల్లడించారు. ఈ సవరణలు చట్టాన్ని మరింత శక్తివంతంగా మారుస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీలో ఎన్డీయే సభ్యులు సూచించిన మార్పులకు ఆమోదం లభించగా.. విపక్షాలు సూచించిన మార్పులు తిరస్కరణకు గురయ్యాయి. వీటిపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ పనిచేయలేదని విపక్ష సభ్యులు ఆరోపించారు. మొత్తంగా జేపీసీ సూచించిన 14 ప్రతిపాదనల ఆమోదానికి సంబంధించి జనవరి 29న ఓటింగ్ జరగనుంది. జనవరి 31న తుది నివేదిక లోక్‌సభకు అందజేయనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com